



డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నిక

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా జనసేనకు చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు ఎన్నికయ్యారు. కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జియ్యాని శ్రీధర్ డిప్యూటీ మేయర్ పదవిని కోల్పోయారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కొత్త డిప్యూటీ మేయర్ ఎన్నిక నిమిత్తం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయగా, కోరం లేక మంగళవారానికి వాయిదాపడిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎన్నికల అధికారి హోదాలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కౌన్సిల్ హాల్‌కు చేరుకున్నారు. ఎన్నిక నిర్వహించడానికి 56 మంది సభ్యులు అవసరమని, హాజరైనవారి సంఖ్యను లెక్కించాలని రో అధికారులను ఆదేశించారు. ఏడుగురు ఎమ్మెల్యేలు, 52 మంది కార్పొరేటర్లు అప్పటికి హాజరైనట్టు అధికారులు నివేదించడంతో సమావేశాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. డిప్యూటీ మేయర్ పదవికి పోటీ చేయాలనుకునే అభ్యర్థిని ఒకరు ... మిగతా 6వ పేజీలో



డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజుకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి, జేసీ మయూర్ అశోక్. చిత్రంలో ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, గణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు ఉన్నారు.

ఎల్‌కేజీకి రూ.లక్ష!

ప్రైవేటు పాఠశాలల బాదుడు

నగరంలో మూడు కేటగిరీలు...
- టాప్ స్కూల్స్‌లో ఫీజు రూ.60 వేల నుంచి రూ.80 వేలు
- రెండో కేటగిరీలోని స్కూళ్లలో రూ.30 వేల నుంచి రూ.60 వేలు
- మూడో కేటగిరీలో రూ.20 వేల నుంచి రూ.30 వేలు
- ట్రాన్స్‌పోర్టు, పుస్తకాలు, యూనిఫామ్ ఖర్చులు అదనం

- తక్కువలో తక్కువ రూ.50 వేలు నుంచి రూ.1.5 లక్షలు వసూలు
- ఏటా పది నుంచి 20 శాతం మేర పెంపు
- నియంత్రణపై దృష్టిసారించని విద్యా శాఖ అధికారులు



విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఏటా పది నుంచి 20 శాతం మేర పెంచేస్తూ పిల్లల తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ప్రైవేటు స్కూల్స్ వసూలుచేసే ఫీజులను పర్యవేక్షించాల్సిన విద్యా శాఖ వర్గాలు పట్టనట్టు వ్యవహరిస్తున్నాయి.

ఫీజులను బట్టి నగర పరిధిలోని స్కూల్స్‌ను మూడు కేటగిరీలుగా విభజించవచ్చు. ఇందులో టాప్ కేటగిరీలో ఉండే స్కూల్స్‌లో ఫీజులు రూ.లక్షల్లో ఉంటాయి. ఈ జాబితాలో పది పాఠశాలలు ఉంటాయి. ఆయా స్కూల్స్‌లో ఎల్‌కేజీ విద్యార్థికి తక్కువలో తక్కువ లక్ష నుంచి లక్షన్నర (ఏసీ అయితే) వరకూ చెల్లించాల్సి ఉంటుంది. అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, ఇతర ఫీజుల పేరిట సుమారు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకూ వసూలు చేస్తున్నారు. వీటితోపాటు రవాణా చార్జీ (బస్సు) కింద నెలకు రూ.2 వేలు చొప్పున ఏడాదికి రూ.20 వేల నుంచి రూ.24 వేలు, పుస్తకాల కోసం రూ.4 వేల నుంచి రూ.8 వేలు, యూనిఫామ్ కోసం రూ.4 వేల నుంచి ఆరు వేలు వసూలు చేస్తున్నారు. ఇతర యాక్టివిటీస్ పేరిట మరో మూడు నుంచి ఆరు వేల రూపాయలు తీసుకుంటున్నాయి. మొత్తంగా చూసుకుంటే పేరొందిన స్కూల్స్‌లో ఎల్‌కేజీకి కనీసం లక్ష రూపాయల వరకూ వసూలు చేస్తున్నాయి. ఇక స్కూల్స్‌లో ఉండే ఏసీ, ఇతర సదుపాయాలను బట్టి అదనంగా మరో రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. రెండో కేటగిరీకి చెందిన స్కూల్స్‌లో ఎల్‌కేజీ విద్యార్థికి అడ్మిషన్ ఫీజు, ఇతర ఫీజులు కలిపి ఏడాదికి 30 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటున్నాయి. ఈ స్కూల్స్‌లో కూడా పుస్తకాలకు, రవాణా ఖర్చులకు, యూనిఫామ్‌కు మరో రూ.30 నుంచి రూ.40 వేలు వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ కేటగిరీకి చెందిన స్కూల్స్ నగర పరిధిలో సుమారు 50 వరకు ఉంటాయి. ఈ స్కూల్స్‌లో ఎల్‌కేజీ విద్యార్థికి రూ.60 వేల నుంచి రూ.90 వేల వరకూ అవుతోంది. ఇక, మూడో కేటగిరీకి చెందిన స్కూల్స్ ఫీజులు మొదటి రెండు కేటగిరీలతో పోలిస్తే కొంత తక్కువగా ఉన్నప్పటికీ భారీగానే వసూలు చేస్తున్నారు. ఈ స్కూల్స్ కూడా అడ్మిషన్స్, ఇతర ఫీజులు కలిపి ఏడాదికి రూ.20 వేల నుంచి రూ.30 వేలు, పుస్తకాలు, యూనిఫామ్, ఇతర ఖర్చులకు కలిపి మరో రూ.20 వేలు వసూలు చేస్తున్నారు. అంటే, ఎల్‌కేజీ చదివించాలంటే సాధారణ, మధ్య తరగతి ప్రజలకు కనీసం రూ.50 వేలు వెచ్చించాల్సి వస్తోంది. ఇక, తరగతిని బట్టి ఫీజులు మారుతుంటాయి. ఒక్కో తరగతికి వెళుతున్న కొద్దీ 10 నుంచి 20 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. టాప్ స్కూల్‌లో ఐదో తరగతి విద్యార్థికి రెండు లక్షల వరకూ ఖర్చవుతుందని చెబుతున్నారు.

ప్రైవేటు వైపు పరుగులు..

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉత్తమ బోధనా నైపుణ్యాలు కలిగిన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ సాధారణ, మధ్య తరగతి ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు స్కూల్స్‌లో చేర్పించేందుకు మొగ్గుచూపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు భారీగానే ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలలు వసూలుచేసే ఫీజులను నియంత్రించడంలో విద్యా శాఖ అధికారులు ఉదాసీనంగా ... మిగతా 6వ పేజీలో

భారీ వర్షం

తెల్లవారుజాము నుంచి రెండు గంటలు ఏకధాటిగా..

- సాగర్‌నగర్‌లో 75.5 మి.మీ.నమోదు
- మరో రెండు, మూడు రోజులు వర్షాలు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్



సెంటర్	మి.మీ.
సాగర్‌నగర్	75.5
విశాఖ వ్యాలీ స్కూలు	70
సీతమ్మధార	65
హెచ్‌బీ కాలనీ	61.75
ఎండాడ	51
మహారాణిపేట	41.25
కాపులుప్పాడ	38

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం ఏడు గంటల వరకూ భారీవర్షం కురిసింది. తరువాత కొంత సమయం చిరుజల్లులు కురిశాయి. సోమవారం అర్ధరాత్రి నగరంపైకి సముద్రం నుంచి భారీగా తేమ మేఘాలు వచ్చాయి. దీంతో తెల్లవారుజామున వర్షం మొదలైంది. నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. సముద్రానికి ఆనుకుని ఉన్న సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ, విశాలాక్షి నగర్, ఎంవీపీ కాలనీతో పాటు వెంకోజీపాలెం, ఆరిలోవ, హెచ్‌బీ కాలనీల్లో భారీవర్షం కురిసింది. ఆ సమయంలో ఉరుములు, మెరుపులు, పిడుగుల శబ్దంతో నగరం దద్దరిల్లింది. కొన్నిచోట్ల భారీవర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. జ్ఞానాపురం రైల్వేఅండర్‌పాస్ వద్ద భారీగా నీరు చేరింది. అటువైపు వెళ్లే ఓ బస్సు ఆ నీటిలో చిక్కుకుంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు క్రేన్ సాయంతో బయటకు తీశారు. వర్షం కురవడంతో నగరంలో వాతావరణం కొంతవరకు చల్లబడింది.

సాగర్ నగర్‌లో 75.5 మి.మీలు

మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు నగరంలో పలుచోట్ల భారీవర్షం కురిసింది. అత్యధికంగా ... మిగతా 6వ పేజీలో

యోగా డేకు విస్తృత ఏర్పాట్లు

అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశం

వచ్చే నెల 21న ఆర్కే బీచ్‌రోడ్డులో నిర్వహణ

- హాజరుకానున్న ప్రధాని నరేంద్రమోదీ
- రెండున్నర లక్షల మంది పాల్గొనేలా చూడాలని నిర్ణయం
- గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 21వ తేదీన నగరంలో నిర్వహించనున్న '11వ అంతర్జాతీయ యోగా డే' ప్రపంచ రికార్డు సృష్టించేలా ఏర్పాట్లుచేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ప్రధాని నరేంద్రమోదీ పాల్గొననున్నందున ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఈ వేడుకలకు సంబంధించి మంగళవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి జూన్ 21 వరకు యోగా మంత్‌గా పాటించాలన్నారు. ప్రజలకు యోగాపై శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా యోగా డే వేడుకల్లో పాల్గొనే వారి నుంచి రిజిస్ట్రేషన్లు తీసుకోవాలని, విద్యార్థులను, డ్వాక్రా మహిళలను, ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల ఉద్యోగులను, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, శిక్షకులు, యోగా అసోసియేషన్లు, నిపుణులను భాగస్వాములను చేయాలని సూచించారు. ఆర్కే బీచ్ నుంచి పార్క్ హోటల్ వరకూ, అదేవిధంగా పార్క్ హోటల్ నుంచి భీమిలి బీచ్ రోడ్డు వరకు సుమారు 2.5 లక్షల మంది యోగాలో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్పష్టంచేశారు. ఆర్కే బీచ్, రుషికొండ బీచ్, క్రికెట్ స్టేడియం, పోలీస్, స్పోర్ట్, నేవీ ప్రాంగణాలతోపాటు ఖాళీ ప్రదేశాలను యోగా వేడుకల నిర్వహణకు గుర్తించినట్టు వెల్లడించారు. కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు, డ్రోన్స్, తాగునీటి సదుపాయం, టిఫిన్, రవాణా సదుపాయం, వాహనాల పార్కింగ్, శానిటేషన్, టాయిలెట్స్, వలంటీర్లు, మెడికల్ టీమ్‌లు ఏర్పాటు, అతిథులకు వసతి, భద్రత, సీసీ కెమెరాలు ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.


యోగా డే ఏర్పాట్లపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రపంచ రికార్డు నెలకొల్పాలి..

ప్రధాని పాల్గొనే 11వ అంతర్జాతీయ యోగా డే కార్యక్రమాన్ని అత్యంత ... మిగతా 6వ పేజీలో


నిందితుల దగ్గర నుంచి రికవరీ చేసిన నగదును పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

98 చోరీ కేసుల్లో 81 మంది అరెస్టు

- రూ.కోటికి పైగా విలువైన సొత్తు స్వాధీనం

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): గత నెలలో జరిగిన చోరీలకు సంబంధించి 81 మందిని నగర నేర పరిశోధన విభాగం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.కోటికిపైగా విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పోలీస్ కమిషనరేట్ ఆవరణలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీ శంఖబ్రతబాగ్చి వెల్లడించారు. ఏప్రిల్ నెలలో 123 చోరీ కేసులు నమోదుకాగా, వాటిలో 98 కేసులను ఛేదించామన్నారు. చోరీలకు పాల్పడిన 81 మందిని అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి 562 గ్రాముల బంగారం, 701 గ్రాముల వెండి, రూ.7.85 లక్షలు నగదు, 54 మోటార్ సైకిళ్లు, 380 సెల్‌ఫోన్‌లు, ఒక ల్యాప్‌టాప్, నాలుగు ఏసీలు, ఒక టీవీ, పది బ్యాటరీలు...మొత్తం రూ.1,00,53,580 విలువైన సొత్తును రికవరీ చేశామన్నారు. వాటిని బాధితులకు సీపీ చేతుల మీదుగా అందజేశారు. కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, చోరీ సొత్తు లభ్యంకాగానే నేరుగా తమకు వాటిని అందజేయడం చాలా సంతోషంగా ఉందంటూ బాధితులు సీపీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ లక్ష్మణరావు, సీఐలు శ్రీనివాసరావు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కోసం

కుమారదేవంలో ఇసుక రీచ్

వర్షాకాలంలో కొరత రాకుండా అధికారుల ముందు జాగ్రత్త

- నగరంలోని రెండు డిపోల్లో రెండు లక్షల టన్నుల మేర నిల్వ చేయాలని నిర్ణయం
- శ్రీకాకుళం జిల్లాలోని రెండు రీచ్‌ల నుంచి మరో లక్ష టన్నులు

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది వర్షాకాలంలో ఇసుక కోసం నిర్మాణదారులు పడిన ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న జిల్లా యంత్రాంగం ఈ సంవత్సరం అప్రమత్తమైంది. ఈ నాలుగు నెలలు... నగర అవసరాలకు సరిపడా ఇసుక నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి, ఆమోదం తీసుకుంది. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి ఆనుకుని గోదావరి నదిలో రీచ్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఈ రీచ్ నుంచి రెండు లక్షల టన్నుల ఇసుకను విశాఖకు తరలించాలని అధికారులు నిర్ణయించారు.

కుమారదేవం ఇసుక రీచ్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సందర్శించారు. నది గట్టు నుంచి రెండు కిలోమీటర్ల లోపల రీచ్ వరకూ రహదారి ఏర్పాటు చేయాలని విశాఖ జిల్లా గనుల శాఖ ఏడీ మజ్జి శ్రీనివాసరావు, గాజువాకలో ప్రైవేటు ఇసుక డిపో లీజుదారుడిని ఆదేశించారు. కుమారదేవం రీచ్ నుంచి మింది (గాజువాక), ముడసర్లోవల్లో గల ప్రైవేటు డిపోలకు ఇసుక తరలిస్తారు. ఇసుక తరలింపు పర్యవేక్షణకు గనుల శాఖ సిబ్బందిని రీచ్ వద్ద నియమించారు. రోజుకు 50 లారీలతో ఇసుక రవాణా ప్రారంభించి, 100 లారీలకు పెంచాలని నిర్ణయించారు.


ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

ఈ ఏడాది వర్షాకాలం ముందుగానే ప్రారంభం అవుతుందన్న వాతావరణ శాఖ అంచనాతో అధికారులు అప్రమత్తమయ్యారు. సాధ్యమైనంత వరకు నది సమీపంలో ఖాళీ ప్రదేశం లీజుకు తీసుకుని అక్కడ నిల్వ చేయాలని భావిస్తున్నారు. ముందు నిల్వ చేసుకుని తరువాత గాజువాక, ముడసర్లోవకు రవాణా చేసుకునేలా నిర్ణయించారు. రీచ్ నుంచి ... మిగతా 6వ పేజీలో

ఉక్కులో కార్మికుల సమ్మె పాక్షికం, ప్రశాంతం


బైక్ ర్యాలీకి సిద్ధమైన కాంట్రాక్టు కార్మికులు

స్టీల్‌ప్లాంటులో కార్మికుల సమ్మె మంగళవారం ప్రశాంతంగా జరిగింది. అదేవిధంగా కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె కూడా మొదలైంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. - వార్త మెయిన్‌లో

కోరమాండల్, మెయిల్ సహా పలు రైళ్లు రీ షెడ్యూల్

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో కోరమాండల్, మెయిల్ ఎక్స్‌ప్రెస్ వంటి పలు స్థిర (ఒరిజినేటింగ్) రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో ఆలస్యంగా నడుస్తున్నాయి. మంగళవారం ఉదయం 7 గంటలకు బయలుదేరాల్సిన చెన్నై సెంట్రల్-షాలిమార్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12842) సాయంత్రం 5.15 గంటలకు, ఉదయం 10.35 గంటలకు బయలుదేరాల్సిన బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ (12864) బుధవారం ఉదయం 4 గంటలకు, మంగళవారం ఉదయం 5.30 గంటలకు బయలుదేరాల్సిన జగదల్‌పూర్-హౌరా సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (18006) మధ్యాహ్నం 2 గంటలకు, మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరాల్సిన షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841) బుధవారం వేకువజామున 00.30 (మంగళవారం అర్ధరాత్రి 12.30) గంటలకు, మంగళవారం సాయంత్రం 5.55 గంటలకు బయలుదేరాల్సిన సంత్రాగచ్చి-చెన్నై సెంట్రల్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (22807) బుధవారం వేకువజామున 00.30 (మంగళవారం అర్ధరాత్రి 12.30) గంటలకు, మంగళవారం సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరాల్సిన షాలిమార్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (22853) బుధవారం వేకువజామున 2.45 గంటలకు, మంగళవారం రాత్రి 7 గంటలకు బయలుదేరాల్సిన చెన్నై సెంట్రల్-హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840) బుధవారం ఉదయం 11 గంటలకు బయలుదేరేలా రీ షెడ్యూల్ చేశామని రైల్వే అధికారులు తెలిపారు.

31న సీఎం పాడేరు రాక



పాడేరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 31న అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరు రానున్నారు. జూన్ నెల సామాజిక పెన్షన్ల పంపిణీని ప్రారంభించనున్నారు. లక్ష ఎకరాల్లో కాఫీ తోటల అభివృద్ధి, జీవో నంబర్ 3కి ప్రత్యామ్నాయ జీవోపైనా సీఎం ప్రకటన చేస్తారని తెలుస్తోంది.



మిని మహానాడులో మాట్లాడుతున్న గంటాశ్రీనివాసరావు



మిని మహానాడుకు హజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు



'స్వర్ణాంధ్ర' గీతాన్ని ఆలపిస్తున్న యువనేత గంటా రవితేజ

భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా

- భారీ మెజారిటీలో గెలిపించినందుకు కృతజ్ఞుడిని
- లక్ష సభ్యత్వాలతో 'భీమిలి' సత్తా చాటాం
- చంద్రబాబుతో పని చేయడం గర్వకారణంగా ఉంది
- మినీ మహానాడులో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు

కొమ్మాది, మే 20 (ఆంధ్రజ్యోతి) : అత్యధిక మెజారిటీతో గెలిపించిన భీమిలి ప్రజల ఆదరాభిమానాలను మర్చిపోలేనని, ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసితన రుణం తీర్చుకుంటానని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. చంద్రబాబునాయడి ప్రోత్సాహంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన తాను ఆయన రూపొందించిన నాయకుడిని అని చెప్పకోవడానికి గర్వపడతానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పీఎంపాలెంలోని వి.కన్వెక్షన్‌లో నిర్వహించిన భీమిలి నియోజకవర్గ మిని మహానాడుకు ఆయన ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వవిఖ్యాత, నవరసన నటనా సార్వభౌమ నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి పేదలకు కూడు, గుడ్డ, గూడు నినాదంతో ప్రజల్లోకి వెళ్లి తొమ్మిదినెలల్లోనే అధికారంలోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. పార్టీ స్థాపించి ప్రచారంలో ఉండగా, ఆయన కుమారుడు బాలకృష్ణ వివాహం జరిగినా.. ప్రజలే ముఖ్యమని ప్రచారంలో నిమగ్నమైన మహోన్నత నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. అలాంటి వ్యక్తితో ప్రత్యక్షంగా పని చేయలేకపోయానన్న బాధ ఉందని, కానీ పాలనాసంస్కరణలు, అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించిన చంద్రబాబుతో పని చేయడ ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఢిల్లీ, బెంగళూరు, పంజాబ్, ముంబై, చెన్నై ఇలా.. దేశంలోని పెద్ద నగరాలకు వెళ్లినపుడు చంద్రబాబు వంటి విజనరీ లీడర్ ఉండడం ఆంధ్రప్రదేశ్ ప్రజల అదృష్టమని కొనియాడుతుంటారన్నారు. ప్రపంచంలోనే కార్యకర్తలకు సంక్షేమనిధి ఏర్పాటు చేసిన మొట్టమొదటి పార్టీ తెలుగుదేశం మాత్రమేనని, యువ నాయకుడు నారా లోకేష్ ఇచ్చిన స్ఫూర్తితో కోటి సభ్యత్వాల మార్కును సాధించటం రాజకీయ చరిత్రలోనే అరుదైన విషయమని అన్నారు. సభ్యత్వ నమోదులో లక్ష సభ్యత్వాలు దాటి భీమిలి నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి పదిస్థానాల్లో ఉండడం వెనుక గంటా రవితేజ కృషి ఎంతో ఉందని అభినందించారు. అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసితన రుణం తీర్చుకుంటానని తెలిపారు. పద్మనాభస్వామి ఆలయానికి ఘాట్‌రోడ్డు నిర్మాణం, సింహాచలం దేవస్థానం నిర్మాణాల క్రమబద్ధీకరణ వంటి దీర్ఘకాలికి అంశాలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం అప్పులతో రాష్ట్రాన్ని అప్పగించినప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను ప్రాధాన్యతా క్రమంలో అమలు చేస్తున్నామన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల గుర్తించి నామినేటెడ్ పదవులు భర్తీలో న్యాయం చేస్తామన్నారు. ఒక కార్యకర్తకు ఒక పదవి వంటి నిబంధనలు అనుసరించి ఎంపిక చేసిన కొత్త కమిటీలను తొందర్లోనే ప్రకటిస్తామని తెలిపారు.

స్వర్ణాంధ్ర గీతాన్ని ఆలపించిన యువనేత గంటా రవితేజ

యవనాయకుడు భీమిలి ఇన్‌చార్జి గంటారవి తేజ 'స్వర్ణాంధ్ర' గీతాన్ని ఆలపించి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీసీఎస్, గూగుల్, అదాని వంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సాఫ్ట్‌వేర్ సంస్థలను భీమిలి నియోజకవర్గానికి కేటాయిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆయా సంస్థలో ఉద్యోగాల్లో స్థానిక యవతకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ భీమిలి పరిశీలకుడు బాలాజీ, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, పీవీ నరసింహం, మొల్లిహేమలత, పిళ్లామంగమ్మ, గంటాఅప్పలకొండ, లొడగలఅప్పారావు, గోరేగురునాథ్, జెడ్పిటిసి సభ్యుడు గాడు వెంకటప్పడు,డాసరిశ్రీనివాస్, ఘట్టమనేని సుబోష్‌చంద్రబోస్,కోరాడరమణ,బి.ఆర్.బి నాయడు, జీవన్‌కుమార్,మొల్లిలక్ష్మణరావు,పిళ్లావెంకట్రావు,గొలగానిస న్యాసిరావు,బొడ్డేపూడిదొరబాబు,నాగోతిసత్యనారాయణ భీమిలి నియోజకవర్గం నుండి బారీ సంఖ్యలో టి.డి.పి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికల తొలగింపునకు జడ్సీ ఆదేశం



కాలువలు పరిశీలిస్తున్న జడ్సీ అయ్యప్పనాయుడు

తగరపువలస, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షం కురిసిన నేపథ్యంలో తగరపువలస పరిధిలో పాడైపోయిన మురుగునీటి కాల్వలను జోనల్ కమిషనర్ పి.అయ్యప్పనాయుడు సిబ్బందితో కలిసి పరిశీలించారు. తగరపువలస కూడలి, సబ్బివానిపేట, బాలాజీ నగర్, రామన్నపేట నగరపువీధి ప్రాంతాల్లో వర్షపు నీటి ప్రవాహం వల్ల కాలువల్లో మురుగునీరు అంతా కొట్టుకుని వచ్చి రహదారులపైకి చేరింది. దీంతో కాలువల్లో నిండిన పూడికలను దగ్గర ఉండి పారిశుధ్య కార్మికులతో తీయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మీనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఇతర ప్రాంతాల్లోని కాలువల్లో కూడా పూడికలు తొలగించాలని ఆదేశించారు. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచి ఉండిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఘనంగా సత్యసాయిబాబా ప్రేమ రథయాత్ర



పద్మనాభంలో సత్యసాయి ప్రేమ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

పద్మనాభం, మే 20 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయి బాబా శత జన్మదినోత్సవ సంవత్సరం సందర్భంగా చేపట్టిన ప్రేమవాహిని రథయాత్ర మంగళవారం మండలంలోని పలు గ్రామాల మీదుగా సాగింది. ఆనందపురం మండలంలోని గ్రామాల మీదుగా పద్మనాభం చేరుకున్న సత్యసాయి ప్రేమ రథానికి భక్తులు హారతులతో స్వాగతం పలికారు. హారతులు పట్టారు. మద్ది, శేరిఖండం, రెడ్డిపల్లి, తునివలస గ్రామాల మీదుగా రథయాత్ర సాగింది. తన ఉపదేశాల ద్వారా ప్రతి ఒక్కరిలో సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను పెంపొందించిన భగవాన్ సత్యసాయిబాబా వారి మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని సత్యసాయి సేవా సంస్థల సేవాదళ్ రాష్ట్ర కో-ఆర్డినేటరు డి.రాఘవరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల విశాఖ జోన్ కో-ఆర్డినేటరు వి.సాయికుమార్, స్థానిక భజన మండలి సభ్యులు సన్యాసిరావు, ఎంవీ రమణ, గురునాథరావు, చిన్నారావు, ఎర్నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీను, రాము, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

22న రెడ్డిపల్లిలో హనుమాన్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు



పద్మనాభం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెడ్డిపల్లిలో గల కృష్ణ చంద్రబాబాజీ మఠంలో ఉన్న హనుమాన్ ఆలయంలో ఈ నెల 22న భారీ ఎత్తున హనుమాన్ జయంతి వేడుకల నిర్వహణకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి పంచామృతాభిషేకాలు, సింధూర అర్చన తమలపాకులతో సహస్ర నామార్చన తదితర పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్న సమారాధన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు హనుమాన్ బైక్ ర్యాలీ శోభాయాత్ర చేపడతారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న మహిళా మోర్చా నాయకురాలు ఉమ్మడి సుజాత

విశాలాక్షినగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): లోకమాత పుణ్యశ్లోక అహల్యాబాయ్ హోల్కర్ మూడు శతాబ్ది వేడుకలను పురస్కరించుకుని విశాలాక్షినగర్‌లో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 157 దేవాలయాల పునర్నిర్మాణంతో పాటు మహిళా సాధికారత, చేనేత రంగాన్ని ప్రోత్సహిస్తూ ప్రజాసేవ కోసం జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. ధర్మాన్ని ఎక్కడ కాపాడతారో అక్కడ న్యాయం గెలుస్తుందని ఆనాడే ఆమె అభిప్రాయపడ్డారన్నారు.

జ్ఞానసముపార్జనతో వ్యక్తిత్వ వికాసం

సింహాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వ్యక్తిత్వ వికాసానికి జ్ఞాన సముపార్జన చాలా ముఖ్యమని జిల్లాపరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఆర్.నరసింగరావు అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం సారథ్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జ్ఞానాన్ని ఆర్జించడానికి గ్రంథాలయాలు దోహదపడతాయని, అందుకే విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయాలకు వెళ్లి ఉపయుక్తమైన వాటిని చదివేందుకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు.

ప్రజల సంక్షేమం కోసమే రైతు బజార్లు: గంటా



రైతుబజార్‌ను ప్రారంభించిన అనంతరం రైతులు, అధికారులు, నాయకులతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస, మే 20 (ఆంధ్రజ్యోతి) : రైతుబజార్ల ద్వారా అన్ని ప్రాంతాల్లో ఒకే ధరకు తాజా కూరగాయలు అందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని భీమిలి ఎంఎల్‌ఏ గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. తగరపువలస గ్రంథాలయం వీధిలో రూ.78 లక్షలతో నిర్మించిన రైతుబజారు భవనాలను మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. దుకాణ సముదాయాలను పరిశీలించిన అనంతరం గంటా మాట్లాడుతూ రైతుబజారు కావాలన్న స్థానికుల కోరిక ఇన్నాళ్లకు నెరవేరిందన్నారు.ప్రాధాన్యతా క్రమంలో రైతులకు స్టాల్స్ కేటాయించాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడానికి ఈ వ్యవస్థను తెలుగుదేశం ప్రభుత్వమే గతంలో ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. రైతుబజార్లలో కూరగాయలు అమ్మే రైతులను మార్చడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని గంటా అన్నారు. తగరపువలస రైతుబజారుకు రైతుల్ని కేటాయించడంతో పాటు ఇందులో మరిన్ని సదుపాయాలు కల్పించవలసిన అవసరం ఉందని అన్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ యార్డు పరిధిలో రైతులకు 27, డ్వాక్రా సభ్యులకు, దివ్యాంగులకు కొన్ని స్టాల్స్ కేటాయించారు. వీటితో పాటు 5 దుకాణాలను అదనంగా ఏర్పాటు చేశారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ టి.సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కిరణ్, సహాయ డైరెక్టర్ షేక్ హసీనా, డీఈ నారాయణ, భీమిలి మార్కెట్ కమిటీ కార్యదర్శి లక్ష్మీ చైతన్య, జెడ్సీ అయ్యప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఎస్టేట్ అధికారిని నియమించనందున మార్కెటింగ్ శాఖ అధికారులే పర్యవేక్షిస్తారని అధికారులు చెప్పారు వ్యాపార లావాదేవీలు చూశాక మరింత విస్తరిస్తామని అన్నారు. కార్పొరేటర్ లక్ష్మి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ పేరిట సేవా కార్యక్రమాలు



అనాథాశ్రమంలో చిన్నారులతో ఎన్టీఆర్ అభిమానులు

సింహాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): టాలీవుడ్ అగ్రశ్రేణి నటుడు జూనియర్ ఎన్‌టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మహావిశాఖ 98వ వార్డుకు చెందిన అభిమానులు సొంతంగా నిధులు సమకూర్చుకుని వార్డులోని మనసు అనాథాశ్రమానికి చేరుకుని అనాథలకు బిస్కెట్లు, పండ్లు, దుప్పట్లు, పాలప్యాకెట్లు, టవల్స్, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు తిరుపతి శ్రీను, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణోత్సవాన్ని మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువన సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసి మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ జీలకర్ర, బెల్లం, మాంగల్యధారణ జరిపించారు. స్వామికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

వాన పడితే వంతెన కింద చెరువే!



ఎత్తు వంతెన కిందకు చేరిన నీరు

మధురవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని మధురవాడ ఎత్తు వంతెన వద్ద వాహనచోదకులు మంగళవారం వరద నీటిలో ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రాంతంలో ఏమాత్రం వర్షం పడినా ముందుగా వరదనీరు ఎత్తువంతెన కిందకు చేరడంతో వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు. 15 ఏళ్లుగా ఇదే సమస్య స్థానికులను వేధిస్తోంది.వంతెనకు ఇరువైపులా కాలువలు ఉండడం, వాటిలో నుంచి నీరు కూడా ఎత్తువంతెన కిందకే వస్తుండడంతో సమస్య తీవ్రమవుతోంది. మంగళవారం వేకువన కుండపోత వర్షం కురవడంతో వంతెన దిగువ ప్రాంతం జలమయమైంది. ద్విచక్రవాహన చోదకులు నీటిలో ఇబ్బంది పడుతూ సర్వీసు రోడ్డుకు చేరుకున్నారు. రేవళ్లపాలెం మాస్టర్‌ప్లాన్ రహదారిలో కాలువలు నిర్మిస్తే ఈ సమస్యకు కొంతవరకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు అంటున్నారు. జీవీఎంసీ సిబ్బంది సర్వీసు రోడ్డులో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించడంతో వరదనీరు కొంత తగ్గింది. ఈ సమస్యకు ఇంజనీరింగ్ శాఖాధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

హనుమత్ జయంతి ఉత్సవాలకు శ్రీకారం



మెట్లమార్గంలో ఆంజనేయస్వామి విగ్రహం

సింహాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): రామభక్త హనుమత్ జయంతి వేడుకలకు సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. సింహాచల దేవస్థానం అనుబంధ దేవాలయంగా సింహగిరి మెట్లమార్గంలో కొలువై ఉన్న సాక్షి ఆంజనేయ దేవాలయంలో హనుమత్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మంగళవారం వేకువజామున ప్రభాతారాధనలు జరిపారు. షోడశోపచారాల తరువాత మధ్వసంప్రదాయ రీతిలో గణపతి పూజ, పుణ్యాహవచనాలు చేసి రుత్విక్ వరుణలు ఇచ్చారు. తరువాత రామాయణంలోని సుందరకాండ పారాయణం ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసి మంత్రపుష్పం, నివేదనలు జరిపిన తరువాత భక్తులకు తీర్థగోష్ఠి జరిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

- సిగ్నల్ ఇవ్వకుండా మలుపు తిప్పుతున్న లారీని ఢీకొన్న కారు
- వివాహానికి నరసాపురం వెళుతుండగా ఘటన
- ఇద్దరికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో మృతురాలు వెంకట నరసమ్మ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు ముందుభాగం

కశింకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి మంగళ వారం కారులో నరసాపురం వెళుతుండగా ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా లారీ మలుపు తిప్పడంతో దానిని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.

పశ్చిమ గోదావరి నరసాపురం చవలపేట ప్రాంతానికి చెందిన బుంగా వెంకట నరసమ్మ(72) విశాఖలో కుమారుడు నరేశ్ వద్ద ఉంటోంది. స్వగ్రామంలో బంధువుల వివాహం ఉండడంతో కుమారుడు నరేశ్, మనుమరాళ్లు బి.కీర్తన, పి.సువర్ణ, పి.సంకీర్తనతో కలిసి ఆమె కారులో మంగళవారం వేకువజామున విశాఖ నుంచి బయలుదేరింది. తెల్లవారుజాము 4.48 గంటలకు బయ్యవరం వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా మలుపు తిప్పడంతో దానిని కారు బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జు కాగా, వెంకట నరసమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు నరేశ్, మనువరాలు సువర్ణకు తీవ్రగాయాలయ్యాయి. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, వృద్ధురాలి మృతదేహానికి అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతురాలి కుమారుడు నరేశ్ విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. బంధువుల వివాహం నిమిత్తం కుటుంబ సభ్యులంతా సోమవారం రాత్రి బస్సులో వెళ్లిపోయారు. తెల్లవారుజామున నరేశ్ తన తల్లి, అక్క కుమార్తెలు, అతని కుమార్తెలతో కారులో బయలుదేరి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజామున వర్షం కురవడంతో ముందు వెళుతున్న వాహనం కనిపించకపోవడం, దీనికి తోడు లారీ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా మలుపు తిప్పడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

ప్రతిపాదిస్తే, మరొకరు బలపరచాల్సి ఉంటుందని, ఇద్దరు కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే ఎన్నిక జరుపుతామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు పేరును పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు ప్రతిపాదించగా, ఉత్తరం నియోజకవర్గ శాసన సభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు బలపరిచారు. ఇంకెవరైనా పోటీలో ఉన్నారా? అని జాయింట్ కలెక్టర్ అడగ్గా..సభ్యుల నుంచి సమాధానం లేకపోవడంతో గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. అనంతరం డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్టు ధ్రువీకరణ పత్రాన్ని దల్లిగోవిందరాజుకు అందజేశారు. ఆ సమయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతోపాటు మరి కొందరు కార్పొరేటర్లు సమావేశానికి హాజరైనప్పటికీ వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకోబోమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. వెంటనే దల్లి గోవిందరాజుతో ప్రమాణ స్వీకారం చేయించారు.

పలువురి అభినందన

డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజును ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు అభినందించారు. దల్లి గోవిందరాజుకు భార్య, కుటుంబ సభ్యులు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నాటి సమావేశానికి గైర్హాజరైన అసంతృప్త కార్పొరేటర్లు మంగళవారం జరిగిన సమావేశానికి హాజరుకావడంతోపాటు డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజును అభినందించి శుభాంకాంక్షలు తెలిపారు.

ఇది కూటమి విజయం

- జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్

జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు ఎన్నికకావడం కూటమి విజయమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ అన్నారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం ఆయన జీవీఎంసీ కార్యాలయం బయట విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో జీవీఎంసీని దోచుకుతిన్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైసీపీ అరాచక పాలన నుంచి నగరవాసులను బయటపడేసేందుకు మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టి సమష్టిగా విజయం సాధించామన్నారు. వచ్చే మూడు, నాలుగు నెలల్లో నగర అభివృద్ధి వేగం పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఎల్‌కేజీకి రూ.లక్ష!

... 5వ పేజీ తరువాయి

వ్యవహరిస్తున్నారు. ఫీజుల పట్ల తల్లిదండ్రుల్లో ఆవేదన వ్యక్తమవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

రెండో తరగతికి రూ.లక్షకుపైనే...

- రాజేశ్వరరావు, విద్యార్థి తండ్రి

మా అబ్బాయి ప్రముఖ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. ఏడాదికి రూ.60 వేలు స్కూల్ ఫీజు కడుతున్నా. పుస్తకాలు, ఇతర ఖర్చులకు మరో రూ.40 వేలు వరకూ ఖర్చు అవుతోంది. ప్రత్యేక కార్యక్రమాల కోసం మరో పది వేల రూపాయలు చెల్లిస్తున్నాం. రెండో తరగతి చదివే విద్యార్థికి లక్ష రూపాయలకు పైగా వెచ్చిస్తున్నా. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా వాడి జీవితం బాగుంటుందన్న ఆశతో ఖర్చుకు వెనుకాడడం లేదు.

సాధారణ స్కూల్‌లో చేర్పించాలని ఆలోచించా. ఈ స్కూల్‌తో పోలిస్తే రూ.3 వేలు మాత్రమే తగ్గుతోంది. ఆ మాత్రం దానికి ఎందుకని పెద్ద స్కూల్‌లో చేర్పించాం. చదువుతోపాటు క్రమశిక్షణ, ఇతర యాక్టివిటీస్‌కు పెద్దపీట వేస్తారని చెప్పడంతో ఈ స్కూల్‌లో చేర్పించాను.

విశాఖ కోసం కుమారదేవంలో ఇసుక రీచ్

... 5వ పేజీ తరువాయి

గాజువాక 220 కి.మీ. దూరం ఉంది. కాగా శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి నదులలో రీచ్‌ల నుంచి మరో లక్ష టన్నుల ఇసుక తరలించనున్నారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లా నుంచి భీమిలి, ముడసర్లోవ డిపోలకు ఇసుక తరలిస్తున్నారు. నదుల్లో నీటి ప్రవాహం పెరిగే సమయానికి భారీగా ఇసుక తవ్వి బయట నిల్వ చేయనున్నారు.

గత ఏడాది నగరంలోని మింది, ముడసర్లోవ, భీమిలిలో ప్రైవేటు వ్యక్తులకు ఇసుక డిపోలు కేటాయించారు. భీమిలి, ముడసర్లోవ డిపోల్లో టన్ను రూ.700, గాజువాకలో రూ.1000కు విక్రయించాలని ప్రభుత్వం సూచించింది. ప్రస్తుతం నగరంలో టన్ను రూ.700కు దొరుకుతుండడంతో ప్రైవేటు డిపోల్లో ఆశించినంత అమ్మకాలు జరగడం లేదు.

అయితే వర్షాకాలంలో నదుల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండనున్నందున తవ్వ కాలకు అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో నగర అవసరాల మేర ఇసుక అందుబాటులో ఉండేలా యంత్రాంగం చర్యలుతీసుకుంటోంది. వర్షాకాలంలో చిల్లర వ్యాపారుల వద్ద ఇసుక నిల్వలు ఉండవని, అప్పుడు ప్రభుత్వం కేటాయించిన ప్రైవేటు డిపోలలో అమ్మకాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు.

యోగా డేకు విస్తృత ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. 2023లో సూరత్‌లో 1.53 లక్షల మందితో ఒకేచోట యోగా దినోత్సవాన్ని నిర్వహించి వరల్డ్ రికార్డును సాధించారని, ఈసారి ఆ రికార్డును తిరగరాయలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో 2.5 లక్షల మందిని భాగస్వామ్యం చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బుధవారం ఉదయం 6.30 నుంచి 8 గంటల మధ్యలో విశాఖలో ఆర్కే బీచ్‌రోడ్డులో వేయి మందితో ప్రాథమిక వేడుకలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. సమీక్ష సమావేశంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, అజితా, రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్‌తో పాటు జిల్లా అధికారులు, యోగా టీచర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీ వర్షం

... 5వ పేజీ తరువాయి

సాగర్‌నగర్‌లో 75.5 మి.మీ. నమోదైంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

వచ్చే రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్ తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు 24 గంటలపాటు కంట్రోల్‌రూమ్ సేవలు అందిస్తుందన్నారు. కంట్రోల్ రూమ్‌లో ఫోన్ నంబర్లు 0891-2590100, 0891-2590102 అందుబాటులో ఉంటాయన్నారు.



కేక్ కటింగ్‌లో పాల్గొన్న నల్లూరు సూర్యనారాయణ, తదితరులు

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

గాజువాక, మే 20 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను గాజువాకలోని ఓ థియేటర్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్‌వైడ్ ఫ్యాన్స్ కన్వీనర్, టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ కేక్ కట్ చేసి మాట్లాడారు. సినీ రంగానికే వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి దివంగత ఎన్టీఆర్ అని, ఆయన వారసత్వంతో జూనియర్ ఎన్టీఆర్ రాణిస్తున్నారు. కార్యక్రమంలో స్టీల్ సిటీ ఎన్టీఆర్ ఫ్యాన్స్ సభ్యులు శ్రీను, వాసు, శివ రాం, గణపతి, అరుణ్, రాము, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని టీడీపీ 86వ వార్డు కార్యాలయంలో రాష్ట్ర ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ నల్లూరు సూర్యనారాయణ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అభిమానులు వేగుంట శ్రీను, ఎం.గణపతి, జగదీశ్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్గో హ్యాండ్లింగ్‌లో అదానీ గంగవరం పోర్టు రికార్డు

గాజువాక, మే 20 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టులో ఈ నెల 18న ఒకరోజు (24 గంటల్లో) 1,93,588 మెట్రిక్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ నిర్వహించడం ద్వారా సరికొత్త రికార్డు నెలకొల్పినట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వేగవంతమైన రైల్వే నెట్‌వర్క్, మెరుగైన కార్గో హ్యాండ్లింగ్ సిస్టమ్ నిర్వహణలో గంగవరం పోర్టు ముందుంటుందన్నారు. వినియోగదారులకు ఉత్తమమైన సేవ లందించడమే తమ ధ్యేయమన్నారు.

టిఫిన్ షాపులో అగ్ని ప్రమాదం

పెదగంట్యాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీప సిద్ధేశ్వరంలో గల ఓ టిఫిన్ షాపులో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. గ్యాస్ స్టౌవ్ నుంచి మంటలు అధికమై ఒక్కసారిగా సిలిండర్‌కు అంటుకోవడంతో ఎగసి పడ్డాయి. దుకాణంలోని ఫర్నీచర్ కాలిపోయింది. లీడింగ్ ఫైర్‌మెన్ ఎం.సోమునాయుడు ఆధ్వర్యంలో పెదగంట్యాడ అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కుక్ బైరాగికి స్వల్ప గాయాలయ్యాయి.

పశువులకు టీకాలు

మల్కాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశువుల ఆస్పత్రిలో డాక్టర్ సునీల్ మంగళవారం పశువులకు గొంతువాపు వ్యాధి సోకకుండా టీకాలను వేశారు. క్రాంతినగర్‌లో కొన్ని పశువులు గొంతువాపు వ్యాధి కారణంగా జ్వరంతో బాధపడుతున్నాయని, అందువల్ల టీకాలు వేశామన్నారు. వర్షాకాలంలో పశువులకు ఈ వ్యాధి సోకడంతో మేత మేయడానికి ఇబ్బంది పడతాయని, కొన్ని ఆహారం తినక మృతి చెందుతాయన్నారు. ఈ క్రమంలో 175 పశువులకు టీకాలు వేశామన్నారు.

సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 15, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, బద్దచిక్కుడు 44, నిమ్మకాయలు (కిలో) 80, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240



ఆటోనగర్ డీ-బ్లాక్ రహదారిలోని గోతుల్లో చేరిన వర్షపు నీరు



పెందుర్తిలో జాతీయ రహదారిపై వర్షపు నీరు తిష్ఠ వేసిన దృశ్యం

వర్షం.. రహదారులు ఛిద్రం!

» రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు

కూర్మన్నపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా మంగళవారం వేకువజాము నుంచి కురిసిన భారీ వర్షానికి రహదారులన్నీ ఛిద్రంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. 71వ వార్డు పరిధి ఆటోనగర్ వెళ్లే రోడ్డులోని గోతుల్లో వర్షపు నీరు చేరింది. దీంతో రహదారిలో రాకపోకలు సాగించే తుంగ్లాం, ఆటోనగర్ ఈ-బ్లాక్, ఎఫ్-బ్లాక్, చట్టివానిపాలెం, యాదవజగ్గరాజుపేట, కాపు జగ్గరాజుపేటకు చెందిన ప్రజలతో పాటు పలు కంపెనీల కార్మికులు ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడ్డారు. రహదారిపై పెద్దఎత్తున వర్షపు నీరు నిలవడంతో ఎక్కడ గోయ్యి ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గోతుల మయమైన రహదారులను నూతనంగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న ఆటోనగర్-యాదవ జగ్గరాజుపేట ప్రధాన రహదారి

చెరువును తలపిస్తున్న జాతీయ రహదారి

పెందుర్తి: వర్షానికి ఇక్కడి జాతీయ రహదారి ఆరు లేన్ల రహదారి చెరువును తలపిస్తోంది. పెద్దఎత్తున వర్షపు నీరు హైవేపై నిలిచిపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై పలుచోట్ల విద్యుత్ దీపాలు లేకపోవడంతో వర్షాల సమయంలో రాత్రిపూట ఈ మార్గంలో ప్రయాణిం చడం ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైవేపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వర్షపు నీటిని ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించే చర్యలు చేపట్టారు. హైవేపై వర్షపు నీరు నిలిచిపోతుండడంపై పలుమార్లు ఎన్‌హెచ్ అధికారులకు రాతపూర్వకంగా వినతిపత్రా లిచ్చినా ఎలాంటి స్పందన లేదని ఎస్ఐ తెలిపారు.

టీడీపీ ఆవిర్భావంతోనే రాజకీయాల్లో మార్పులు

» 'గాజువాక' మినీ మహానాడులో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

గాజువాక, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే దేశ రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకున్నాయని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. గాజువాక క్లబ్‌లో మంగళవారం జరిగిన టీడీపీ గాజువాక నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివంగత ఎన్టీ రామారావు ప్రజలకు సేవ చేయాలనే తపనతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 1982లో స్థాపించిన తెలుగుదేశం పార్టీ ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తన పాలనతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఎన్టీఆర్ నిలిచారని, అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబునాయుడు కొత్త కొత్త పథకాలను ప్రవేశపెడుతూ ప్రజా సంక్షేమంగా ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. టీడీపీ ఆవిర్భవించాకే రాజకీయాలంటే ప్రజలకు తెలిసిందని పేర్కొన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని, చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు ఆనందంగా జీవనం సాగిస్తున్నారని, రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతిపథంలో ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా రాష్ట్ర పరిశీలకుడు ఎంవీఎస్ఆర్ చౌదరి, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, బొండా జగన్, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, రాజాన రామారావు, లేళ్ల కోటేశ్వరరావు, నాయకులు గొర్లె వెంకునాయుడు, ఎండీ రఫీ, నల్లూరు సూర్యనారాయణ, పుచ్చా విజయ్ కుమార్, కొగంటి లెనిన్‌బాబు, ఎ.లక్ష్మణరావు, ఇల్లపు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై పడిన ఐరన్ బండిల్



ఆటోనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న ఓ లారీ పైనుంచి ఐరన్ రోల్ బండిల్ ఒక్కసారిగా నడిరోడ్డుపై పడిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో లారీ వెనక ఎటువంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆటోనగర్ కూడలి వద్దకు వచ్చేసరికి లారీ ముందు వెళ్తున్న ఓ వాహనాన్ని సడన్‌గా ఆపడంతో లారీ డ్రైవర్ కూడా బ్రేక్ వేశారు. దీంతో లారీపై ఉన్న ఐరన్ బండల్ అమాంతం రోడ్డుపై పడిపోయింది. అయితే ఆ లారీ వెనక ఎలాంటి వాహనాలు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీంతో అరగంటపాటు ట్రాఫిక్ జామ్ అయింది. గాజువాక పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఓ భారీ క్రేన్‌ను తెపించి రోడ్డుపై పడిన ఐరన్ బండిల్‌ను పక్కకు తీయించారు.

పారిశుధ్య కార్మికులకు శానిటరీ సామగ్రి పంపిణీ

గోపాలపట్నం, మే 20(ఆంధ్రజ్యోతి): ఊరును శుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ అప్పలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ 91వ వార్డు ప్రజారోగ్య విభాగం సిబ్బందికి శానిటరీ సామగ్రిని మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు విధులు నిర్వహించే సమయంలో తగు భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు పంపిణీ చేశారు.

కార్మికులంతా ఐక్యంగా ఉండాలి

భెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహూ

అక్కిరెడ్డిపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణతో పాటు కార్మిక హక్కులను కాపాడుకునేందుకు కార్మికులందరూ సంఘాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని భెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహూ అన్నారు. భెల్ అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో కర్మాగారం ప్రధాన గేటు ఎదుట మంగళవారం కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి జూలై 9న జరగనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు జీటీపీ ప్రకాశ్, పీవీఎన్ రాజు, బాబూరావు, నారపరెడ్డి, విజయ్‌కుమార్, జగన్నాథరావు, మురళీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీని పరిశీలించిన సీఎంహెచ్‌వో



సీఎంహెచ్‌వో పరిస్థితిని వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ రమేశ్

మల్కాపురం/ సింధియా, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రాంగణాన్ని జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేశ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. వర్షం కురిస్తే ఈ ప్రాంతం పూర్తిగా నీట మునగడంతో పాటు వ్యర్థాలు కూడా చేరుతున్నాయి. ఈ మేరకు ఆయన సిబ్బందితో వచ్చి పరిశీలించి పరిస్థితి పై శానిటరీ ఇన్స్పెక్టర్లు రమేశ్, రవికుమార్‌తో మాట్లాడారు. వర్షం పడితే మల్కాపురం ఎగువ ప్రాంతాల నుంచి మురుగునీరు నేరుగా ఈ ప్రాంతానికి వచ్చేస్తుందని, ఎన్నో సార్లు ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేశామని చెప్పారు. ఈ విషయంలో ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు. ఐఓసీలోకి మురుగునీరు, వ్యర్థాలు వెళ్లిపోతున్నాయని దానివల్ల కంపెనీలో చమురు లోడింగ్‌లకు కూడా ఇబ్బంది కలుగుతోందనే విషయాన్ని కూడా సీఎంహెచ్‌వో దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం పొక్లైన్ తీసుకొచ్చి గెడ్డలో ఉన్న చెత్తా చెదారం తొలగించారు. భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.వర్షాకాలం దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన గెడ్డల్లో పూడికతీత పనులు చేపడతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ 5 ప్రజా ఆరోగ్యశాఖ సహాయ వైద్యధికారి సునీల్ కుమమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందిస్తాం: తహశీల్దార్

పెందుర్తిరూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): సింహాచలం నుంచి కొత్తవలస వరకు చేపట్టిన అదనపు రైలు ట్రాక్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అన్నారు. దీనిలో భాగంగా సోమవారం రాత్రి కలెక్టర్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు స్థానిక రైతులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. పొర్లుపాలెం, చింతలఅగ్రహారం, చీమలాపల్లి గ్రామాలకు చెందిన సుమారు 60మంది రైతులు ట్రాక్ నిర్మాణంలో భాగంగా భూముల కోల్పోతున్నారని, వీరందరికీ ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లిస్తుందని పెందుర్తి తహశీల్దార్ ఆనంద్ కుమార్ స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.



సీఎంఆర్‌ఫ్ చెక్కును అందిస్తున్న గండి బాబ్జీ

సీఎం సహాయ నిధి పేదలకు వరం

» మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ

పెందుర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అన్నారు. పెందుర్తి టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ వైద్య పరంగా అవసరాలు ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం ఈ నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో సబ్బవరం మండలం ఆరిపాకకు చెందిన కుక్కల లక్ష్మి రూ.36,278, పెందుర్తి రెల్లి కాలనీకి చెందిన రాడి లక్ష్మికి రూ.25,166 చెక్కులను బాబ్జీ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, గండి దేముడు, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చరల్ మార్కెటింగ్ విభాగ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

మల్కాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 58వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి పొత్తబత్తుల శ్రీనివాసరావును విశాఖ జిల్లా అగ్రికల్చరల్ మార్కెటింగ్ డైరెక్టర్‌గా నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే గణబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాసను గణబాబు సన్మానించి వెంకటేశ్వర స్వామి పటాన్ని బహూకరించారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉమామహేశ్వరీ, 58వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రామ్మోహన్‌నాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ

మల్కాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలోని జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం జాతీయ సేవా పథకం సీనియర్ అధికారి అనసూయాదేవి పాల్గొని పిల్లలకు బొమ్మలు, పువ్వులు, పర్సులను తయారీలో శిక్షణ ఇచ్చారు. ఇలాంటి కళాకృతుల తయారీ ద్వారా పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఆమె అన్నారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై కిశోర బాలికలకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న కిశోర బాలికలు

గోపాలపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష వల్ల మహిళల హక్కులకు భంగం కలుగుతోందని, సామాజిక, ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నాయని చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, సెక్టార్ సూపర్ వైజర్ జే.టీ.ఎస్.జ్యోతి అన్నారు. గోపాలపట్నం-1 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన లింగ అసమానతపై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ లింగ అసమానత సమాజంపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని, అన్ని రంగాల్లో మహిళలు రాణించాలంటే విద్య ఎంతో అవసరమన్నారు. బాల్యవివాహాలను పోత్సహించకూడదని అవగాహన కల్పించారు. కిశోర బాలికలకు ఏమైన సమస్యలుంటే వెంటనే తమని సంప్రదించాలని జ్యోతి పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు, తదితరులు

తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,559వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ సమ్మెలో 70 శాతం మంది కార్మికులు విధులను బహిష్కరించి పాల్గొనడం అభినందనీయమన్నారు. 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ పదేళ్ల ప్రధాని మోదీ పాలనలో ఏపీకి, ప్రభుత్వ రంగ సంస్థలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులను కలుపుకుని ప్లాంట్ యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు. నాయకుడు ఎస్.రామారావు మాట్లాడుతూ ప్యాకేజీలో భాగంగానే కార్మికుల తొలగింపు జరుగుతుందని మంత్రి శ్రీనివాసవర్మ చెప్పడాన్ని తప్పుబడుతున్నామన్నారు. ఇంటక్ ఏపీ, తెలంగాణ ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను రోడ్డుపాలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, జి.శ్రీనివాస్ మంత్రి రవి, దొమ్మేటి అప్పారావు, రమణమూర్తి, దాసరి సురేశ్, డీవీ రమణారెడ్డి, రమణమూర్తి, లక్కరాజు సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న దల్లి గోవిందరాజు, తదితరులు

పెదగంట్యాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు ఎన్నికవ్వడంతో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తూ మంగళవారం రాత్రి పెదగంట్యాడ, నిర్వాసిత కాలనీల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పెదగంట్యాడలోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన రాలీ బీసీ రోడ్డు, నెల్లిముక్కు, దుర్గవానిపాలెం, గొడ్డుపాలెం, సిద్ధేశ్వరం, సీతానగరం ప్రధాన రహదారుల మీదుగా సాగింది. కార్యక్రమంలో 64, 75, 76 వార్డులకు చెందిన జనసేన నాయకులు, జనసైనికులతో పాటు గంగవరం, పల్లిపాలెం, జాలరిపల్లిపాలెం, తదితర ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడిగా కర్రి దశేంద్ర



అగనంపూడి, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 85వ వార్డు అధ్యక్షుడిగా ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఏదూరివానిపాలేనికి చెందిన కర్రి దశేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం పార్టీ జిల్లా అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. తనపై నమ్మకం ఉంచి రెండోసారి వార్డు అధ్యక్షుడిని అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసాదుల శ్రీనివాస్‌లకు దశేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం సీపీఐ ఆందోళన

మల్కాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పేదలకు ఇళ్ల పట్టాలు అందించడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ, సీపీఐ ఆధ్వర్యంలో ములగాడ తహశీల్దార్ కార్యాలయం దగ్గర మంగళవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ మాట్లాడుతూ జీవో నెంబర్ 30 ప్రకారం అర్హులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని, అలాగే టిడ్కో ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం సీపీఐ సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, విశాఖ జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మద్యం షాపులు, బార్లలో పోలీసుల తనిఖీలు

పెందుర్తి, మే 20(ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాలను, బార్లను, హోటళ్లలను పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొన్ని మద్యం దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని, కొన్ని హోటళ్లలో ఆహారపదార్థాలో నాణ్యత లోపం, భద్రత చర్యలు పాటించడం లేదని తనితఖీల్లో గుర్తించామన్నారు. నిబంధనలు పాటించని మద్యం దుకాణాల, హోటళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చామని పోలీసులు చెప్పారు. మద్యం దుకాణాలను ఉదయం పది నుంచి రాత్రి పది వరకు నడపాలని, బార్లను ఉదయం పదిగంటలు నుంచి రాత్రి పదకొండు వరకు నడపాలని చెప్పారు. మద్యం దుకాణాల దగ్గర సీసీ కెమెరాలు, అత్యవసర ద్వారాలు, సేఫ్టీ పరికరాలు, పార్కింగ్ నిర్వహణ డ్రంక్ అండ్ డ్రైవ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఐ సతీశ్ కుమార్ హెచ్చరికలు జారీ చేశారు. ఆహారపదార్థాల్లో నాణ్యత లోపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హత్య కేసులో ఏడుగురి అరెస్టు

పరవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన హత్యకు సంబంధించి ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పరవాడ డీఎస్పీ వల్లెం విష్ణుస్వరూప్ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముత్యాలమ్మపాలేనికి చెందిన మైలపల్లి బంగార్రాజు వద్ద చింతకాయల ఎర్రయ్య రూ. 63వేలు అప్పుగా తీసుకున్నాడు. రూ.45 వేలు చెల్లించిన ఎర్రయ్య మిగతా రూ. 18వేలు బాకీ తీర్చలేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఎర్రయ్యకు వరుసకు మేనల్లుడైన కొవిరి కామేశ్ అలియాస్ కామరాజు కత్తితో బంగార్రాజుపై దాడి చేసి హతమార్చాడు. అందుకు కామరాజు తమ్ముడు శివాజీ, మిగతా కుటుంబసభ్యులు సహకరించారు. అనంతరం వారు పరారయ్యారు. ఎస్పీ పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి మంగళవారం ఉదయం నిందితులందరినీ అచ్యుతాపురం మండలం మడుతూరు వద్ద పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు కామేశ్ అలియాస్ కామరాజుతో పాటు కొవిరి శివాజీ, కొవిరి ఆర్మీ ముత్యాలు, చింతకాయల ఎర్రయ్య, కొవిరి ముత్యాలు, వాసుపల్లి ప్రవీణ్‌కుమార్, కొవిరి ముత్యాలమ్మగా గుర్తించారు. నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు.

పారిశుధ్య సిబ్బందికి కిట్ల పంపిణీ

సింధియా, మే 20, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు పరిధి జైంద్రకాలనీలో మంగళవారం వార్డు కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా) శానిటరీ సిబ్బందికి హైజీన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటరీ సిబ్బందికి ఈ రకమైన ప్రోత్సాహం ఉంటే పని పట్ల నిబద్ధతతో ఉంటారన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం పొంచి ఉంది...తస్మాత్ జాగ్రత్త!


కొద్ది రోజుల క్రితం విరిగిపడిన చెట్టు

సీతమ్మధార, మే 20 (ఆంధ్రజ్యోతి): నీడ నిచ్చే చెట్లు నరికేయాలని ఎవరూ కోరుకోరు. జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో ఏఎంజీ రోడ్డులో రెండు పెద్ద చెట్లు మొదళ్లు కుళ్లిపోయి పడిపోయే స్థితిలో ఉన్నాయి. వాటిని తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేసినా, ఎమ్మెల్యే సూచించినా జీవీఎంసీ యంత్రాంగం స్పందించడం లేదు. కొద్దిరోజుల క్రితం గాలి, వాన లేకుండానే ఓ చెట్టు కూలిపోయిన ఘటనలో ఓ మహిళ దుర్మరణం చెందారు. వచ్చేది వర్షాకాలం, ఈదురు గాలులు, జోరువానలు ఎక్కువ ఉంటాయి. ఈసారి నైరుతి ముందుగానే పలకరిస్తుందని వాతావరణ శాఖ బులెటిన్లు విడుదల చేస్తోంది. ఇప్పటికే వాతావరణంలో మార్పులు వచ్చి సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. నిన్న మొన్న కురిసిన వానలకు, వీచిన గాలులకే కొంచెం బలంగా ఉన్న చెట్లు, స్తంభాలు పడిపోయాయి. అటువంటిది వర్షాకాలం వస్తే ఈ రెండు చెట్లు పడిపోవడం ఖాయమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు చీకటి పడగానే మందుబాబులు ఆ చెట్ల కిందకు చేరి దారిన వచ్చిపోయేవారికి ఇబ్బంది కలిగిస్తున్నారు. ఆ చెట్లను తొలగిస్తే ఎలాంటి సమస్యలు ఉండవని స్థానికులు మరోసారి గుర్తు చేస్తున్నారు. మొదళ్లు కుళ్లిన ఆ రెండు చెట్లను తొలగిస్తే ఎటువంటి ప్రమాదానికి అవకాశం ఉండదని, దుస్సంఘటనలు జరగక ముందే ఆచెట్లను తొలగించాలని కోరుతున్నారు.

వేలాడుతున్న విద్యుత్ దీపం

నక్కవానిపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గల ఏఎంజి ఆసుపత్రి రోడ్డులో గల చెట్టు మధ్యలో మూడు విద్యుత్ దీపాలలో ఒకటి నేల వైపు వేలాడుతోంది. ఆ దీపం వెలగడం లేదు. తీగలు సరిచేసి విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


కొమ్మల మధ్యలో వేలాడుతున్న విద్యుత్ దీపం

సీతమ్మధారలో నేలకొరిగిన చెట్టు


సోమవారం రాత్రి వీచిన గాలికి పడిపోయిన చెట్టు

సీతమ్మధార, మే 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 24వ వార్డు తహసీల్దార్ కార్యాలయం ఎదురు రోడ్డు ఏఎంజీ ఆసుపత్రి ఎదురుగా రోడ్డుపక్కన ఉన్న చెట్టు సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి నేల కొరిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. అయితే పక్కనే ఉన్న బడ్డీపై చెట్టు పడడంతో పాక్షికంగా దెబ్బతింది. గతంలో కూడా ఈ రోడ్డులో చెట్టు పడి ఓ మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే.

కస్తూరినగర్‌లో కూలిన గోడ


కూలిన గోడను పరిశీలిస్తున్న స్థానికులు

అక్కయ్యపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి): సోమవారం రాత్రి కురిసిన వర్షానికి గ్రేటర్ 46వ వార్డు కస్తూరినగర్-2లోని ఓ ఇంటి ప్రహరీ గోడ కూలిపోయింది. గోడ శిథిలాలతో కాల్వ మూసుకుపోయింది. అంతేకాకుండా ఇల్లు కూడా కూలిపోయే స్థితిలో ఉందని పలువురు స్థానికులు చెబుతున్నారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. టీడీపీ వార్డు అధ్యక్షుడు పుక్కళ్ళ పైడికొండ కూలిన గోడను పరిశీలించారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు

మురళీనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలోని పాలిటెక్నిక్ కాలేజీ దరి యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వార్షిక ఉత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో మంగళధ్వని, వేదమంత్రాలతో వేడుకలు ఆరంభించారు. అష్టోత్తర శతకలశ ఆరాధన పూజాదికాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో కొలువైన స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు వి.సుబ్బరాజు, యశోద దంపతులు, ఆలయకమిటీ సభ్యులు ఎంవీ రాజశేఖర్ ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు గురువారంతో ముగుస్తాయి.



సాయిబాబాకు అభిషేకాలు

సీతమ్మధార, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబా ఆలయంలో వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి, ఆంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ చేసి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, గంధాభిషేకం, విభూది అభిషేకాలు నిర్వహించారు.



ఐటీఐ దరఖాస్తులకు 24 వరకు గడువు

కంచరపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులకు ఈ నెల 24తో గడువు ముగుస్తుందని ఐటీఐల జిల్లా కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. దరఖాస్తు చేయదలచిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా సమీపంలో గల ప్రభుత్వ ఐటీఐలో హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలింపచేసుకోవాలని కోరారు. ఇలా చేసిన అభ్యర్థుల ర్యాంకులు మాత్రమే ప్రవేశాల కౌన్సెలింగ్‌కు అర్హత పొందుతాయన్నారు. ఇప్పటి వరకు ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోలేని అభ్యర్థులు తక్షణమే ఆయా ప్రభుత్వ ఐటీఐల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరానికి వెళ్లి రసీదు పొందాలన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో తరుణ్‌కు రజతం



విశాఖపట్నం స్పోర్ట్సు, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా యూత్ జాతీయ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కళాశాల విద్యార్థి ఎం.తరుణ్ పతకం సాధించాడు. బిహార్‌లో జరిగిన ఈ టోర్నీ పురుషుల 81 కిలోల విభాగంలో పోటీపడిన తరుణ్ అద్భుతంగా రాణించి రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ మధుకుమార్, డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డిలు తరుణ్‌ను అభినందించారు.

జగన్‌తో వైసీపీ ఉత్తర నియోజకవర్గ నాయకుల సమావేశం

మాధవధార, మే 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసీపీ నాయకుడు షేక్ బాబ్జి మంగళవారం ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌ను తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మైనార్టీ వర్గానికి చెందిన కార్పొరేటర్ బర్కత్ అలీ తదితరులు జగన్‌ను కలిసినవారిలో ఉన్నారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్ఠానికి చేపట్టవలసిన కృషిపై సమావేశంలో జగన్ చర్చించినట్లు షేక్ బాబ్జి తెలిపారు. జీవీఎంసీ నాయకులతో జరిగిన ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.

వైభవంగా అమ్మవార్ల పండుగ


కుంచుమాంబ అమ్మవారు

కంచరపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి): రెడ్డి కంచరపాలెం గ్రామ ఆరాధ్య దేవత కుంచుమాంబ ప్రధాన పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తుమ్మడిపాలెం వద్ద గల అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన పండగ సందర్భంగా గ్రామంలో వివిధ స్టేజీ ప్రోగ్రాములు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా శ్రీరామ సేవాసంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

పితాని వీధిలో బంగారమ్మ తల్లి వేడుక

మహారాణిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): గొల్లలపాలెం పితాని వీధివాసుల ఇలవేల్పు, బంగారమ్మ మెట్టపై వెలసిన బంగారమ్మ తల్లి పండుగను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు చెల్లించి పూజలు జరిపారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్ల, కోలాటం, గారడీలు, పులివేషాలు, కత్తి, కర్రసాము, అగ్ని గుండం తొక్కటం, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు అంబరాన్నంటాయి. ప్రధాన రహదారి పొడుగునా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపా లంకరణ ఆకర్షణీయంగా కనిపించింది. సమీప ప్రాంతాల ప్రజలు మహోత్సవంలో పాల్గొన్నారు.


అలంకరణలో బంగారమ్మ అమ్మవారు

అధినేత ఆదేశాలే శిరోధార్యం: వంశీకృష్ణ



కేకు కోస్తున్న ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయకుమార్ తదితరులు

సీతంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాలే తమకు శిరోధార్యమని ఆ పార్టీ నగర అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంగళవారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా జనసేనకు చెందిన దల్లి గోవిందరాజు ఎన్నికైన నేపథ్యంలో సీతంపేటలోని పార్టీ నగర కార్యాలయంలో జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయ్ కుమార్, కార్పొరేటర్లు సమావేశమయ్యారు. అనంతరం వంశీకృష్ణ మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం నలుగురు సభ్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసి డిప్యూటీ మేయర్ పదవికి పరిశీలన చేయించిందన్నారు. ఇద్దరి పేర్లను అధిష్ఠానానికి పంపగా, సీల్డు కవర్‌లో గోవిందరాజును ఎంపిక చేసి తమకు ఉత్తర్వులు పంపారని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. దక్షిణ నియోజకవర్గంలో నాయకుడు శివప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రమేష్‌బాబు, విజయకుమార్‌లు కేకు కోసి అతనికి తినిపించారు. 39వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు షైలపల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు


పనుల ప్రారంభ సూచికగా కొబ్బరికాయ కొట్టిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

కంచరపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి):జీవీఎంసీ 47వ వార్డులో వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. సామాజిక భవనం, గ్రీన్ బెల్ట్‌లో వాకింగ్ నడక మార్గం, కళావేదిక, రక్షణ గోడ నిర్మాణం తదితర పనులను రూ.95 లక్షలతో చేపట్టనున్నట్టు విష్ణుకుమార్ రాజు తెలిపారు. కొండవాలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. రోడ్లు, కాలువలు, సామాజిక భవనాల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. జడ్సీ రాము, జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, ఎండి.నజీర్, కార్పొరేటర్ కామేశ్వరి, బీజేపీ నాయకులు జి.అరుణ్, అరుణ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

దక్షిణ మహానాడులో మూడు తీర్మానాలు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్

మహారాణిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించుకునేందుకు మహానాడు మంచి వేదిక అవుతుందని తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద దక్షిణ నియోజకవర్గం మహానాడు నిర్వహించారు. సీతంరాజు సుధాకర్ నాయకత్వంలో జరిగిన సమావేశంలో దేవాలయ భూములకు సంబంధించి మూడు తీర్మానాలు ఆమోదించారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కడపలో జరగనున్న రాష్ట్ర స్థాయి మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జి మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో తెలుగుదేశానికి పటిష్టమైన కేడర్, నాయకులు ఉన్నారని అన్నారు. వైసీపీ హయాంలోనూ అనేక ఆటుపోట్లు తట్టుకుని కేడర్ నిలబడిందన్నారు. నాయకులు ఉరుకూటి నారాయణరావు, కోడూరు అప్పల రత్నం, గోడి నరసింహాచారి, విల్లూరి చక్రవర్తి, విల్లూరి భాస్కరరావు, బొచ్చా రామిరెడ్డి, కేదారి లక్ష్మి, సీఎం రమణ, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అక్కయ్యపాలెంలో ఘనంగా బీజేపీ తిరంగా యాత్ర

అక్కయ్యపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి): దేశరక్షణ కోసం ప్రాణాలర్పించిన సైనికులకు సంఘీభావంగా మంగళవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజుల ఆదేశాలతో అక్కయ్యపాలెం మండల అధ్యక్షుడు గాదం నాగరాజు నాయకత్వంలో జాతీయ జెండాలు పట్టుకొని సైనికులకు జేజేలు పలుకుతూ తిరంగ యాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొప్పిశెట్టి శంకర్రావు, 42, 43 వార్డుల అధ్యక్షులు రఘు, గురుగోవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తూనికల్లో మోసాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ రాజేశ్‌కుమార్

»తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ రాజేశ్‌కుమార్

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు సంబంధించి జరిగే మోసాలపై అవగాహనను కలిగివుండాలని తూనికలు, కొలతలశాఖ జాయింట్ కంట్రోలర్ జి.రాజేశ్‌కుమార్ అన్నారు. వరల్డ్ లీగ్ మెట్రాలజీ డేను పురస్కరించుకుని మంగళవారం పౌర గ్రంథాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకంలో, కొలతల్లో కచ్చితత్వం, సరైన తూకం పొందేందుకు పాటించాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవాలన్నారు. ప్యాకేజీ రూపంలో ఉండే వస్తువును ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ థామ్ రవికుమార్, విశాఖ కన్స్యూమర్ కౌన్సిల్ చైర్మన్ రామారావు, ఫెడ్కో చైర్మన్ ఎం.సత్యనారాయణ, శత్రుఘ్నుడు, అసిస్టెంట్ కంట్రోలర్లు పీడీవీ అప్పలరాజు, రామచంద్రయ్య, ఆసరా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్, దాసరి సేవలు చిరస్మరణీయం


ఎన్టీఆర్, దాసరి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సినీ దర్శకుడు దివాకర్, డైరెక్టర్ సన్‌మూర్తి తదితరులు

డాబాగార్డెన్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ రంగానికి ఎన్టీరామారావు, డా.దాసరి నారాయణరావులు అందించిన సేవలు చిరస్మరణీయమని సినీ దర్శకుడు డా.దుగ్గివలస దివాకర్, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్టిస్ట్ డైరెక్టర్ సన్‌మూర్తి శ్లాఘించారు. మంగళవారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖరత్న కళా పరిషత్ ఆధ్వర్యంలో సూపర్ సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్, దాసరి చిత్రపటాలకు కళాభూషణ్ డా.పీపీ భాస్కరరావు, ఎ.రామలక్ష్మి, సినీ నటీమణి ఎస్.కే.మదీనా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నో గొప్ప చిత్రాలు తీసిన దాసరి నారాయణరావు, తనదైన నటనతో ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయిన ఎన్టీఆర్ మహనీయులన్నారు. ఈ ఇద్దరి పేరిట అవార్డులను వర్రే నాంచారయ్య, పీలా చిన్నానాయుడు, కొరటాల ప్రభాకర్, మనుపల్లాలకు అందజేశారు. కోట సూర్యనారాయణశాస్త్రి, దోసం గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కశింకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం కారులో నరసాపురం వెళుతుండగా ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా లారీ మలుపు తిప్పడంతో దానిని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం చవలపేట ప్రాంతానికి చెందిన బుంగా వెంకట నరసమ్మ(72) విశాఖలో కుమారుడు నరేశ్ వద్ద ఉంటోంది. స్వగ్రామంలో బంధువుల వివాహం ఉండడంతో కుమారుడు నరేశ్, మనుమరాళ్లతో కలిసి కారులో బయలుదేరింది. తెల్లవారుజాము 4.48 గంటలకు బయ్యవరం వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా మలుపు తిప్పడంతో దానిని కారు బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జు కాగా, వెంకట నరసమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు నరేశ్, మనుమరాలు సువర్ణకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, వృద్ధురాలి మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కాగా మృతురాలి కుమారుడు నరేశ్ విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. బంధువుల వివాహం నిమిత్తం కుటుంబ సభ్యులంతా సోమవారం రాత్రి బస్సులో వెళ్లిపోయారు. తెల్లవారుజామున నరేశ్ తన తల్లి, అక్క కుమార్తెలు, అతని కుమార్తెలతో కారులో బయలుదేరి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజామున వర్షం కురవడంతో ముందు వెళుతున్న వాహనం కనిపించకపోవడం, దీనికి తోడు లారీ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా మలుపు తిప్పడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

భారీ వర్షం

(5వ పేజీ తరువాయి)

సాగర్‌నగర్‌లో 75.5 మి.మీ. నమోదైంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

వచ్చే రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్ తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు 24 గంటలపాటు కంట్రోల్‌రూమ్ సేవలు అందిస్తుందన్నారు. కంట్రోల్ రూమ్‌లో ఫోన్ నంబర్లు 0891-2590100, 0891-2590102 అందుబాటులో ఉంటాయన్నారు. అత్యవసర సమాచారాన్ని వీటికి తెలపవచ్చన్నారు.

యోగా డేకు విస్తృత ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. 2023లో సూరత్‌లో 1.53 లక్షల మందితో ఒకేచోట యోగా దినోత్సవాన్ని నిర్వహించి వరల్డ్ రికార్డును సాధించారని, ఈసారి ఆ రికార్డును తిరగరాయలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో 2.5 లక్షల మందిని భాగస్వామ్యం చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బుధవారం ఉదయం 6.30 నుంచి 8 గంటల మధ్యలో విశాఖలో ఆర్కే బీచ్‌రోడ్డులో వేయి మందితో ప్రాథమిక వేడుకలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. సమీక్ష సమావేశంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, అజితా, రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్‌తోపాటు జిల్లా అధికారులు, యోగా టీచర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్‌కేజీకి రూ.లక్ష!

(5వ పేజీ తరువాయి)

వ్యవహరిస్తున్నారు. ఫీజుల పట్ల తల్లిదండ్రుల్లో ఆవేదన వ్యక్తమవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

రెండో తరగతికి రూ.లక్షకుపైనే...

మా అబ్బాయి ప్రముఖ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. ఏడాదికి రూ.60 వేలు స్కూల్ ఫీజు కడుతున్నా. పుస్తకాలు, ఇతర ఖర్చులకు మరో రూ.40 వేలు వరకూ ఖర్చు అవుతోంది. ప్రత్యేక కార్యక్రమాల కోసం మరో పది వేల రూపాయలు చెల్లిస్తున్నాం. రెండో తరగతి చదివే విద్యార్థికి రూ.లక్షకు పైగా వెచ్చిస్తున్నా. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా జీవితం బాగుంటుందన్న ఆశతో ఖర్చుకు వెనుకాడడం లేదు. సాధారణ స్కూల్‌లో చేర్పించాలని ఆలోచించా. ఈ స్కూల్‌తో పోలిస్తే రూ.3 వేలు మాత్రమే తగ్గుతోంది. ఆ మాత్రం దానికి ఎందుకని పెద్ద స్కూల్‌లో చేర్పించాం. చదువుతోపాటు క్రమశిక్షణ, ఇతర యాక్టివిటీస్‌కు పెద్దపీట వేస్తారని చెప్పడంతో ఈ స్కూల్‌లో చేర్పించాను.

- రాజేశ్వరరావు, విద్యార్థి తండ్రి

విశాఖ కోసం కుమారదేవంలో ఇసుక రీచ్

(5వ పేజీ తరువాయి)

గాజువాక 220 కి.మీ. దూరం ఉంది. కాగా శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి నదులలో రీచ్‌ల నుంచి మరో లక్ష టన్నుల ఇసుక తరలించనున్నారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లా నుంచి భీమిలి, ముడసర్లోవ డిపోలకు ఇసుక తరలిస్తున్నారు. నదుల్లో నీటి ప్రవాహం పెరిగే సమయానికి భారీగా ఇసుక తవ్వి బయట నిల్వ చేయనున్నారు. గత ఏడాది నగరంలోని మింది, ముడసర్లోవ, భీమిలిలో ప్రైవేటు వ్యక్తులకు ఇసుక డిపోలు కేటాయించారు. భీమిలి, ముడసర్లోవ డిపోల్లో టన్ను రూ.700, గాజువాకలో రూ.1000కు విక్ర యించాలని ప్రభుత్వం సూచించింది. ప్రస్తుతం నగరంలో టన్ను రూ.700కు దొరుకుతుండడంతో ప్రైవేటు డిపోల్లో ఆశించినంత అమ్మకాలు జరగడం లేదు. అయితే వర్షాకాలంలో నదుల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండనున్నందున తవ్వ కాలకు అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో నగర అవసరాల మేర ఇసుక అందుబాటులో ఉండేలా యంత్రాంగం చర్యలుతీసుకుంటోంది. వర్షాకాలంలో చిల్లర వ్యాపారుల వద్ద ఇసుక నిల్వలు ఉండవని, అప్పుడు ప్రభుత్వం కేటాయించిన ప్రైవేటు డిపోలలో అమ్మకాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు.

డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నిక

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదిస్తే, మరొకరు బలపరచాల్సి ఉంటుందని, ఇద్దరు కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే ఎన్నిక జరుపుతామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు పేరును పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు ప్రతిపాదించగా, ఉత్తరం నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు బలపరిచారు. ఇంకెవరైనా పోటీలో ఉన్నారా? అని జాయింట్ కలెక్టర్ అడగ్గా...సభ్యుల నుంచి సమాధానం లేకపోవడంతో గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. అనంతరం డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్టు ధ్రువీకరణ పత్రాన్ని దల్లిదోవిందరాజుకు అందజేశారు. ఆ సమయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతోపాటు మరికొందరు కార్పొరేటర్లు సమావేశానికి హాజరైనప్పటికీ వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకోబోమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. వెంటనే దల్లి గోవిందరాజుతో ప్రమాణ స్వీకారం చేయించారు.

పలువురి అభినందన

డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజును ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు అభినందించారు. దల్లి గోవిందరాజుకు భార్య, కుటుంబ సభ్యులు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నాటి సమావేశానికి గైర్హాజరైన అసంతృప్త కార్పొరేటర్లు మంగళవారం జరిగిన సమావేశానికి హాజరుకావడంతోపాటు డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరాజును అభినందించి శుభాంకాంక్షలు తెలిపారు.

ఇది కూటమి విజయం: జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు ఎన్నికకావడం కూటమి విజయమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ అన్నారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం ఆయన జీవీఎంసీ కార్యాలయం బయట విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో జీవీఎంసీని దోచుకుతిన్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైసీపీ అరాచక పాలన నుంచి నగర వాసులను బయటపడేసేందుకు మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టి సమష్టిగా విజయం సాధించామన్నారు. వచ్చే మూడు, నాలుగు నెలల్లో నగర అభివృద్ధి వేగం పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

డిప్యూటీ మేయర్‌కు ఎమ్మెల్యే గంటా అభినందనలు



డిప్యూటీ మేయర్ గోవిందరాజును అభినందిస్తున్న గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన కార్పొరేటర్ దల్లి గోవిందరాజుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన అనంతరం కౌన్సిల్ హాల్‌లో ఎమ్మెల్యేనుగోవిందరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీ అభివృద్ధికి కృషి చేసి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయనకు గంటా సూచించారు.

మేయర్, ఎమ్మెల్యే అభినందనలు..

వెంకోజీపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన కూటమి అభ్యర్థి దల్లి గోవిందరాజును నగర మేయర్ పీలా శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన డిప్యూటీ మేయర్‌ను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుతో కలిసి మేయర్ అభినందిస్తూ విశాఖ నగరాభివృద్ధికి విశేష సేవలు అందించాలని డిప్యూటీ మేయర్‌కు సూచించారు.



డిప్యూటీ మేయర్‌ను అభినందిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వైసీపీ తూర్పు సమన్వయకర్తగా మొల్లి అప్పారావు

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయ కర్తగా మొల్లి అప్పారావు నియమితులయ్యా రు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొల్లి అప్పారావు ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉండగా, ఆయన భార్య మొల్లి లక్ష్మి 16వార్డు కార్పొరేటర్‌గా ఉన్నారు.

సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్-3** :సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచర పాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 20, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 80, బద్ధచిక్కుడు 44, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

» నీట మునిగిన పెదగదిలి, బీచ్ రోడ్డు, హెచ్‌బీ కాలనీ ప్రాంతాలు » వాహనాల రాకపోకలకు ఇబ్బందులు » వర్షం వెలిసిన వెంటనే పారిశుధ్య సిబ్బంది సేవలు



ఆరిలోవ : వరద నీటితో నిండిన పెదగదిలి జంక్షన్



ఆరిలోవ : వరద నీటిలో కారు అవస్థలు



వెంకోజీపాలెం : హెచ్‌బీ కాలనీ స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ కార్యాలయం వద్ద నిలిచిపోయిన నీరు

బీచ్ రోడ్డు, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. తెల తెలవారుతున్న సమయంలో వాన రావడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఇన్నాళ్లూ వేసవి ఎండలతో ఉక్కపోతకు గురైన నగర జీవికి ఈ వర్షం ఎంతో ఊరట ఇచ్చింది. ఆర్కే బీచ్ తీర ప్రాంతం వరదమయమైంది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల కాలువల్లో పూడికలతో నిండిపోవడంతో వర్షం నీరు ప్రవహించే వీలులేక రోడ్ల మీదకు పొంగింది. దీంతో ఆ పరిసరాలు అపరిశుభ్రత నెలకొంది. ఉదయం వేళలో వాన రావడంతో కార్యాలయాలకు వెళ్లాల్సిన ఉద్యోగులు కొంత ఇబ్బంది పడ్డారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి పెదగదిలి కూడలిలో సుమారు అర కిలోమీటరు వరకు వరద నీరు నిలిచిపోయింది. దీంతో ఈ ప్రాంతం తటాకాన్ని తలపించింది. వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ ప్రాంతంలో నీరు నిలిచిపోతుంటుందని స్థానికులు వాపోయారు. ఇది భారీ వర్షం కావడంతో రోడ్డుకు ఆనుకొని ఉన్న చిన్న తోపుడు బండ్లు వరద నీటిలో మునిగి పోయాయి. రోడ్డుపై వెళుతున్న కార్లు కూడా సగానికి మునిగిపోవడంతో కొద్ది సేపు సింహచలం వెళుతున్న వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. జీవీఎంసీ 12వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు పారిశుధ్య సిబ్బందితో ఈ ప్రాంతంలో గల బురద, చెత్తాచెదారాల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. అలాగే చినగదిలి సాయిబాబా గుడి ప్రాంతం, హనుమంతవాక జంక్షనులో గల ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య శాఖ రోడ్డులో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. గ్రేటర్ విశాఖ 13వ వార్డులో గల పైనాపిల్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రాంతం కూడా వరద నీటితో నిండింది.

గత ప్రభుత్వ నిర్వాకంతో...

వెంకోజీపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో ఆఖరిలో హడావుడిగా లక్షల రూపాయలు ఖర్చుపెట్టి సుందరీకరణ పేరుతో నూతన కాలువలు నిర్మించడం, వాటిపై ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయడం చేశారు. కానీ ప్రధాన మార్గాల్లో వర్షం పడితే నీరు వెళ్లే దారి మాత్రం చూపలేదు. దీంతో చినపాటి వర్షం పడినా వర్షపు నీరు ప్రవహించే మార్గం లేక రోడ్డుపై చెరువులా మారుతుంది. ఇదీ.. 15వ వార్డు హెచ్‌బీ కాలనీ స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ కార్యాలయం వద్ద దుస్థితి. అటు కొండవాలు ప్రాంతం, నుంచి రోడ్డుపై వస్తున్న నీరు, ఇక్కడ పడిన వర్షపు నీరు ఫుట్‌పాత్‌కు సరైన నీరు వెళ్లే మార్గం లేక ఈ ప్రాంతంలో రోడ్డుపైనే నీరు నిలిచిపోతోంది. దీంతో ఓ మోస్తరు వర్షం పడినా ఇక్కడ నీరు నిలిచిపోయి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే చాలు ఈ మార్గంలో వెళ్లేందుకు వాహనచోదకులు భయపడుతున్నారు. బురదనీటిలో రోడ్డుపైన ఎక్కడైనా గోతులు ఉన్నాయేమోనని బిక్కుబిక్కుమంటూ పెద్ద వాహనాలు మాత్రమే ఈ నీటిలో ముందుకు సాగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు మాత్రం పక్క మార్గంలో రాంగ్ రూట్లోనే పయనిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో గత జీవీఎంసీ పాలక మండలి నిర్మించిన ఈ ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఉపయోగపడకపోగా, వర్షం పడినప్పుడల్లా వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి.కాగా, జీవీఎంసీ 15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్, శుభ్రం మేస్త్రి రమణ, సిబ్బంది మాత్రం వర్షం ఆగిన వెంటనే ఫుట్‌పాత్‌కు చిన్న చిన్న బెజ్జాలను ఏర్పాటు చేసి నీరు తొలగిపోయే చర్యలు తీసుకన్నారు. దీంతో వర్షం నీరు డ్రైనేజీలోకి వెళ్లడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు కాస్త ఉపశమనం కలిగింది.



ఆరిలోవ : 12వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో రోడ్లపై నిలిచిన బురదను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

కానరాని మోడరన్ ఫుట్‌పాత్‌లు

» హోటల్స్, తోపుడు బండ్ల ఆక్రమణలతో ఉన్నవే కనిపించని పరిస్థితి

వెంకోజీపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం దిగేపోయే ముందు హడావుడిగా కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇక్కడున్న ఆక్రమణలను తొలగించి మోడ్రన్ ఫుట్‌పాత్‌లను నిర్మించారు. అయితే ఇది మూన్నాళ్ల ముచ్చటేగానే మారింది. ఆ తరువాత సార్వత్రిక ఎలక్షన్ రావడం, ప్రభుత్వం మారడం జరిగిపోయింది. నూతనప్రభుత్వం రావడం, పాలనాపరంగా ప్రాధాన్యతలు మారడం, మరోవైపు జీవీఎంసీ మేయర్ మార్పి డి, జీవీఎంసీ కమిషనర్ బదిలీ కావడం, కొత్తగా ఎవరినీ ఇప్పటి వరకూ నియమించకపోవడం తదితర కారణాల వల్ల ఇక్కడి ఫుట్‌పాత్‌లపై యథావిధిగా బడ్డీల ఆక్రమణ జరిగింది. దీంతో 15, 16 వార్డులకు మధ్యలో ఉండే హెచ్‌బీ కాలనీ నుంచి సీతమ్మధార రోడ్డులో ఇరువైపులా నెమ్మదిగా తోపుడు బండ్లతో కూడిన బడ్డీలను ఏర్పాటు చేస్తూ వచ్చారు. ఎంఎంటీసీ కాలనీ వద్ద ఏకంగా అటు ఇటూ కూడా టిఫిన్ హోటళ్లను ఏర్పాటు చేసి ఫుట్‌పాత్‌లు కానరాకుండా పూర్తిగా ఆక్రమించేశారు. రోడ్డుపై చిన్నపాటి తోపుడు బండిని ఏర్పాటు చేస్తే వెంటనే చర్యలు తీసుకునే టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందికి ఇక్కడ ఏకంగా టిఫిన్ సెంటరే ఏర్పాటు చేసినా కానరాకపోవడం ఆశ్చర్యంగా ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌బీ కాలనీ లాస్ట్ బస్టాప్ నుంచి మీద బస్టాప్ వరకూ, అటు ఎంఎంటీసీ కాలనీ నుంచి సీతమ్మధార వరకూ ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమణలతో నిండిపోతున్నాయి. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఇలా ఆక్రమణలకు గురవుతుంటే, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నట్టని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ఫుట్‌పాత్ ఆక్రమించి హోటల్ నిర్వహిస్తున్న దృశ్యం

వీధి విక్రయదారుల నమోదు తప్పనిసరి

జీవీఎంసీ జోన్-3 కమిషనర్ శివప్రసాద్

వెంకోజీపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-3 పరిధిలోని వీధి విక్రయదారులు వారి వివరాలను తప్పనిసరిగా ఈ నెల 23వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని జీవీఎంసీ 3వ జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో జోన్ పరిధిలోని ప్రస్తుతం ఉన్న వీధి విక్రయదారులు, కొత్త వీధి విక్రయదారులు తప్పనిసరిగా వారి వివరాలను స్థానిక సచివాలయంలోని వార్డు వెల్ఫేర్ కార్యదర్శి వద్ద నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు వీధి విక్రయదారులకు అందుబాటులోకి వస్తాయని సర్వేలో నమోదైన వారికి వెండింగ్ కార్డు, వెండింగ్ సర్టిఫికెట్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇది వీధి విక్రయదారులకు గుర్తింపు పత్రంగా పని చేస్తుందని తెలిపారు. కాబట్టి వీధి విక్రయదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సహాయాన్ని పొందేందుకు ప్రతి ఒక్క వీధి విక్రయదారుడు తమ వివరాలను మే 23వ తేదీలోగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని జోన్ల కమిషనర్ తెలిపారు.

సాగర తీరం పరిరక్షణకు చేతులు కలపండి

» బీజేపీ నేత మేడపాటి రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్ర తదితరులు

పెదవాల్తేరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : 'సాగరో రక్షితః' (సాగరాన్ని నువ్వు రక్షిస్తే అది నిన్ను రక్షిస్తుంది) అంటూ నగర వాసులు సముద్ర పరిరక్షణలో తమతో చేతులు కలపాలని బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా మాజీ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం నగర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనం పీల్చే ప్రాణవాయువు సగానికి పైగా సముద్రం నుంచే వస్తుందని, అంతేకాకుండా వాతావరణ సమతుల్యతను సముద్రమే కాపాడుతుందని, పంచభూతాల్లో ఒకటైన జలం సమృద్ధిగా సముద్రంలోనే ఉండడం వల్ల.. దానిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. లేకుంటే సముద్రంలో నివసించే జలచరాలు, పగడపు దిబ్బలు, సముద్రంపై ఆధారపడి జీవించే మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజలకు అపార నష్టం వాటిల్లుతుందని అన్నారు. టూరిజం హబ్‌గా అభివృద్ధి చెందుతున్న విశాఖలో విశాలమైన సాగర తీరం, పచ్చని కొండలు పర్యాటకులను ఆకర్షించడంలో కీలక పాత్ర వహిస్తున్నాయన్నారు. అలాంటి తీరాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు మనం ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం ప్లాటిపస్ ఫౌండేషన్ సుబాష్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా సాగర తీరాల్లో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నమని, ఇప్పటికి సుమారుగా 2 లక్షల 60 వేల కిలోల వ్యర్థాలను తొలగించామన్నారు. పర్యాటక శాఖ వారు కొన్ని తీర ప్రాంతాలను గుర్తించి వాటిని ఆక్వా స్పోర్ట్స్‌కి కేటాయిస్తున్నట్టు తెలిపారు.

అందులో తిమ్మాపురం బీచ్ నుంచి మంగమారిపేట బీచ్ వరకు ఉన్నా తీర ప్రాంతాన్ని కూడా ఈ విధమైన ఆక్వా స్పోర్ట్స్‌కి కేటాయిస్తుందని, అయితే అక్కడ పగడపు దిబ్బలను గుర్తించడం జరిగిందన్నారు. కనీసం పదేళ్లు వాటిని పరిరక్షించుకుంటే తిరిగి అక్కడ చక్కని వాతావరణం ఏర్పడుతుందన్నారు. కాబట్టి ఆ ప్రాంతంలో ఎటువంటి కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా పగడపు దిబ్బలను సంరక్షించుకొనే బాధ్యత మాత్రమే తీసుకోవాలని కోరారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మోహనరాజు పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు



మినీమహానాడుకు బయలుదేరుతున్న భీమిలి టిడిపి కార్యకర్తలు

భీమునిపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయం నుంచి పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మంగళవారం పోతినమల్లయ్యపాలెంలో జరిగిన మినీమహానాడుకు ర్యాలీగా తరలివెళ్లారు. ఉదయం వర్షం కురుస్తున్నా ఈ ర్యాలీని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. తెలుగుదేశం జిందాబాద్, చంద్రబాబునాయుడు జిందాబాద్, గంటా నాయకత్వం వర్థిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ కార్యకర్తలు ర్యాలీగా మినీ మహానాడు నిర్వహించిన పీఎం పాలెం ఎస్ కన్వెన్షన్ సెంటర్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ ర్యాలీలో తెలుగుదేశం నాయకులు గొలగాని నరేంద్రకుమార్, మారోజు సంజీవకుమార్, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న, గాడు సన్యాసినాయుడు, పుక్కళ్ల లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ అమ్మవారి మహోత్సవాలు



అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు, (ఇన్‌సెట్‌లో) పూజలు అందుకుంటున్న పోలమాంబ

రామ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రామ్‌నగర్‌లో పోలమాంబ అమ్మవారి పండుగ మహోత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. రామ్‌నగర్‌తో పాటు పరిసర ప్రాంతాలైన నెహ్రూనగర్, శెట్టిబలిజ సంఘం, గొల్లల పాలెం, బుద్ధలవానిపాలెం గ్రామ ప్రజల ఇలవేల్పు అనేక దశాబ్దాలుగా పూజలు అందుకుంటున్న పోలమాంబకు ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ వేడుకలు ముందుగా ఈ నెల 18న (ఆదివారం) పండుగ చాటింపు, సోమవారం తోలేళ్ళ పండుగ నిర్వహించారు. ఈ క్రమంలో మంగళవారం పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ధూపదీప నైవేద్యాలతో పసుపు కుంకుమలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం రామ్‌నగర్ బజారు సెంటర్‌లో వెలిసి ఉన్న అమ్మవారి సదును పట్టు నుంచి ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ళు బాజాభజంత్రీలు, కోలాటం, గారడీలు, పులివేషాలు, కత్తి కర్రసాము, తదితర కార్యక్రమాలతో సమీప గ్రామాల మీదుగా ఆలయం వరకు భారీ ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు హోరెత్తాయి. అమ్మవారి పండుగ సందర్భంగా రామ్‌నగర్ మొత్తం ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతరకు సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున విచ్చేయడంతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది.

'అడివివరం గ్రామస్థులకు ఆంక్షల నుంచి విముక్తి కల్పించండి'

సింహాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి): భీమిలి నియోజకవర్గ పరిధిలో మంగళవారం జరిగిన మినీ మహానాడులో 98వ వార్డులోని పలు సమస్యలను కార్పొరేటర్ పి.వి.నరసింహం ప్రస్తావించారు. కొన్ని దశాబ్దాలుగా లక్షలాదిమందికి ఇబ్బందికరంగా మారిన పంచగ్రామాల భూ వివాదాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కారం చూపాలని కోరారు. బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో నిర్వాసితులందరికీ టీడీఆర్‌లు జారీ చేయాలని, వాటిని అమ్ముకునే విధంగా అనుమతి ఇవ్వాలని కోరారు. కొందరు అధికారుల అనాలోచిత నిర్ణయంతో అడివివరం గ్రామస్థులంతా ఆస్తులుండీ నిరుపేదలుగా బతకాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. వీరి భూములను ప్రభుత్వ భూములుగా 22ఎలో పెట్టారని, దానిని రద్దు చేసి గ్రామస్థులకు ఊరట కలిగించాలని కోరారు. ఈ మూడు అంశాలపై తీర్మానాలు చేయాలని కార్పొరేటర్ పి.వి. డిమాండ్ చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 ఉద్యోగులు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి : సీఐటీయూ

సిరిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు రాజులు, సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల (102) యూనియన్ విశాఖ జిల్లా కమిటీ సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే యూనియన్‌తో చర్చలు జరిపి న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం రూ.18,500 వేతనం ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.7870 వేతనం ఇవ్వడం చాలా అన్యాయమన్నారు. ఇస్తున్న ఈ కొద్దిపాటి వేతనం కూడా గడిచిన నాలుగు నెలలుగా చెల్లించలేదని గుర్తు చేశారు. యూనియన్ లేవనెత్తిన ఉద్యోగ భద్రత, సెలవులు, కనీస వేతనం, ఇన్సూరెన్స్ తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. తల్లికి, బిడ్డకీ ఎంతో ఉపయోగపడే ఈ 102 సర్వీస్‌ను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మంగాపురంకాలనీలో మంగళవారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటనలో తాతకు తగ్గ మనవడుగా పేరుతెచ్చుకున్న నటుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, మిల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి కార్యదర్శి సన్యాసినాయుడు

ఆరిలోవ, మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మంగళవారం కేంద్రకారాగారంలో గల న్యాయ సహాయ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడారు. ఖైదీలు అందరితో మాట్లాడి వారు చేసిన నేరాలు, కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయసహాయం గురించి వారితో సమీక్షించారు. జైలులో అన్ని సౌకర్యాలు వారికి అందుతున్నయా? లేదా? అంటూ ఆరా తీశారు. జైలులో పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి ఎం .మహేశ్‌బాబు, ఉప పర్యవేక్షణాధికారులు ఎస్.సాయిప్రవీణ్, సీహెచ్ సూర్యకుమార్, సహాయ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రమేష్, జిల్లా న్యాయ సేవాధికారి, జైలర్లు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న భక్తుల సేవలో ఒడిశా దాసుడు



భక్తునికి కుంకుమ అద్దుతున్న దాసుడు

సింహాచలం, మే 20 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహ స్వామి భక్తుడు, ఒడిశాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త లక్ష్మీకాంత్ నాయకోదాసుడు భక్తులు, భగవంతుని సేవలో లీనమయ్యారు. మంగళవారం ప్రభాతారాధనల తరువాత మందీమార్బలంతో అప్పన్న ఆలయానికి చేరుకుని స్వామికి ప్రీతికరమైన సంపెంగలను, మల్లె, తదితర సుగంధ పరిమళభరిత పుష్పమాలికలను, పనస, అరటిపండ్లు, తదితర ఫలాలను తీసుకుని వచ్చి సమర్పించి పూజలు జరిపించారు. తరువాత సింహవల్లీ తాయార్, గోదాదేవి అమ్మవార్ల సన్నిధిలో కూడా పూజలు జరిపించారు. అనంతరం తనతో వచ్చిన ఒడిశా భక్తులకు స్వామికి సమర్పించిన కుంకుమను బొట్టుగా పెట్టి తులసీ పత్రాలను పంపిణీ చేశారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ హిందీ పరీక్ష

ఆరిలోవ, మే 20 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.ఈ పరీక్షకు 97 మంది విద్యార్థులు హాజరు కావాల్సివుండగా, వారిలో 18 మంది మాత్రం హాజరైనట్టు తెలిపారు. 79 మంది పరీక్షలకు హాజరు కాలేదు. డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆరు పరీక్షా కేంద్రాలను, స్క్వాడ్ బృందం 19 పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

ప్రత్యేక పిల్లల భవితకు ప్రభుత్వం భరోసా

» ఎంఈవో పొన్నగంటి రమణ

పద్మనాభం-రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల భవితకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని స్థానిక ఎంఈవో పొన్నగంటి రమణ అన్నారు. అయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల ఉన్న పిల్లలను గుర్తించేందుకు గ్రామాల్లో సర్వే చేపట్టామన్నారు. మండలంలో పద్మనాభం అంగన్వాడీ కేంద్రంలో ఒకరిని, కృష్ణాపురం గ్రామానికి చెందిన ఒకరిని గుర్తించి ఆ ఇద్దరు పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అంగవైకల్యం ఎక్కువ ఉన్న పిల్లలకు ఇంటివద్దే చదివించడానికి జాగ్రత్తలు తీసుకుని ప్రతిభ.ఐఆర్‌పీ ఇంటివద్ద చదువు కొనసాగిస్తామన్నారు. పిల్లలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని సూచించారు. 21 రకాల వైకల్యం ఉన్న పిల్లలను గుర్తించామన్నారు. పిల్లల పేర్లు నమోదు చేసి ఉన్నతాధికారుల నివేదించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఎస్ అధికారికారులు. గీత, జే. చంద్రశేఖర్ ,ఎపిఎం. అప్పలనాయుడు, ప్రత్యేక ఉపాధ్యాయులు హంస.రాజ్ కుమార్. ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు తగరపువలసలో సంతానోత్పత్తి పరీక్షల శిబిరం

తగరపువలస, మే 20 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస రాజా ఆస్పత్రి ప్రాంగణంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత సంతానోత్పత్తి శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరానికి వచ్చే మహిళలకు ఉచితంగా ఏఎన్‌హెచ్ హిమోగ్లోబిన్ పరీక్ష, పురుషులకు వీర్యపరీక్ష, వైద్యులతో డాక్టర్లతో కౌన్సిలింగ్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 'ఒయాసిస్ జననీ యాత్ర' పేరుతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రకృతి సేవకులు

గ్రీన్ పావ్స్ ఆర్గనైజేషన్ పేరుతో విభిన్న కార్యక్రమాల నిర్వహణ

- వన్యప్రాణులు, తీర ప్రాంత పరిరక్షణకు కృషి
- ఆరేళ్లుగా విభిన్న కార్యక్రమాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్న యువత



గ్రీన్ పా సభ్యుల బృందం

(విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి):

ప్రకృతి బాగుంటే అందరూ బాగుంటారు. సృష్టిలోని ప్రతి జీవికి ఆనందంగా జీవించే హక్కు ఉంది. అందుకు అనుగుణమైన వాతావరణాన్ని కల్పించే బాధ్యత ప్రతిఒక్కరిదీ. ఇదే స్లోగన్‌తో ముందుకు సాగుతోంది గ్రీన్ పావ్స్ సంస్థ. వన్య ప్రాణులు, తీర ప్రాంత పరిరక్షణతోపాటు మత్స్యకార మహిళలకు ఉపాధిని కల్పించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు ఈ సంస్థకు చెందిన సభ్యులు. గత కొన్నాళ్లుగా విభిన్నమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ వన్యప్రాణులు, తీర ప్రాంత రక్షణకు విశేషంగా కృషి చేస్తున్న సంస్థ కార్యక్రమాలపై ప్రత్యేక కథనం.

నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో విభిన్న జాతులకు చెందిన పక్షులు, జీవరాశులు, జంతువులు వంటివెన్నో ఉన్నాయి. వీటిలో అనేక జీవరాశులకు ప్రమాదం కూడా పొంచి ఉంటోంది. ఆ ప్రమాదాల పట్ల ప్రజలకు అవగాహన కలిగించడం ద్వారా ఆయా జీవరాశులకు ఇబ్బందులు కలగకుండా చేయాలని భావించారు నగరానికి చెందిన పొట్లూరి అనిల్ చౌదరి. అదే సమయంలో తీరాన్ని కూడా వ్యర్థాలమయం చేస్తూ అనేక జీవరాశులు ప్రమాదంలో పడేటట్టు చేస్తుండడాన్ని ఆయన గుర్తించారు. వీటిపట్ల కూడా ప్రజల్లో అవగాహన కల్పించి వాటి పరిరక్షణకు కృషి చేయాలని భావించిన ఆయన 2019లో గ్రీన్ పాస్ పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

పక్షుల గురించి తెలియజేస్తూ..

నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో విభిన్న జాతులకు చెందిన పక్షులు ఉన్నాయి. వీటిలో అరుదైన పక్షులెన్నో ఉన్నాయి. ఇందులో పావురాలు, చిలుకలు, కొంగలు వంటి సాధారణ పక్షులే కాకుండా ఏషియన్ ప్యారడైజ్ వంటి విభిన్న జాతులకు చెందినవి కూడా ఉన్నాయి. అయితే వీటి గురించి చాలామందికి తెలియదు. కొన్నిచోట్ల ప్రమాదాల్లో ఇటువంటివి ఉన్నప్పుడు ఎవరూ పట్టించుకోరు. వాటి గురించి సమాచారాన్ని అందిస్తే వాటిని రక్షించడంతోపాటు వాటిని మళ్లీ సాధారణ స్థితికి వచ్చేంతవరకు వాటి బాధ్యతను చూస్తుంటారు. అలాగే అవి తీసుకునే ఆహారం గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం ఎప్పటికప్పుడు బర్డ్ వాచింగ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతుండడంతో పాటు రెస్క్యూ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు.

తెగిన వలలతో మహిళలకు ఉపాధి

మత్స్యకారులు వినియోగించే వలలు కొన్నేళ్ల తరువాత తెగిపోతుంటాయి. వాటిని చాలామంది మత్స్యకారులు సంద్రంలో పడేస్తుంటారు. ఇలా చేయడం వల్ల సముద్రంలోని తాబేళ్ల వంటి జీవరాశులు వాటిలో చిక్కుకుని ప్రాణాలను కోల్పోతుంటాయి. ఇటువంటి ప్రమాదాలను నియంత్రించేందుకు మత్స్యకారులకు తెగిపోయిన, పాడైన వలలను మళ్లీ ఒడ్డుకు తెచ్చేలా వారికి అవగాహన కల్పిస్తున్నారు. అయితే వలలను వెనక్కి తీసుకురావడం వల్ల మత్స్యకారులకు ఏమీ ఉపయోగం ఉండదు కాబట్టి, చాలామంది ఆసక్తి చూపించరు. అయితే వెనక్కి తేవడం వల్ల ఉపయోగం ఉంటే మాత్రం వారు తప్పకుండా తీసుకువస్తారు. అందుకే సరిగ్గా దీనిపైనే గ్రీన్ పావ్స్ సంస్థ దృష్టి సారించింది. తెగిపోయిన వలలను రీసైక్లింగ్, అప్ సైక్లింగ్ చేయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఆయా వలలతో మత్స్యకార మహిళలు కీ చైన్స్, ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులు తయారుచేసేలా వారికి శిక్షణ ఇప్పించారు. అలా మహిళలు తయారుచేసిన వస్తువులను సంస్థే కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా చేయూతను అందిస్తోంది. ఒకవైపు మత్స్యకార మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకారాన్ని అందించడంతో పాటు సముద్రంలోని జీవరాశుల ప్రాణాలను కాపాడేలా చేస్తోంది.



తీరంలోని సందర్శకులకు జీవరాశుల గురించి తెలియజేస్తున్న సభ్యులు



జూ పార్కులో అరుదైన సీతాకోక చిలుకలు గురించి వివరిస్తున్న సభ్యులు

సీతాకోక చిలుకల పరిరక్షణకు..

నగర పరిధిలోని అనేకచోట్ల విభిన్న జాతులకు చెందిన వేలాది మొక్కలు ఉన్నాయి. వీటికి ఆకర్షితులై అనేక జాతులకు చెందిన సీతాకోక చిలుకలు వస్తుంటాయి. అయితే చాలామందికి ఆయా మొక్కల గురించి తెలియక పాడుచేస్తుంటారు. దీనివల్ల విభిన్న జాతులకు చెందిన సీతాకోక చిలుకల ఆహారానికి, ఇతర ప్రక్రియలకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్టు ఈ సంస్థ గుర్తించింది. దీంతో ఆయా మొక్కలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఆయా మొక్కలను తొలగించడం వల్ల విభిన్న జాతులకు చెందిన సీతాకోకచిలుకలు ప్రాణాలు కోల్పోయేలా చేస్తున్నారనే విషయాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. వీటిలో అరుదైన కామన్ క్రో బటర్‌ఫ్లై వంటివి ఉన్నట్టు చెబుతున్నారు. సుమారు 120 రకాల సీతాకోకచిలుకలు ఉండగా, వీటికి అవసరమైన ఆహారం, ఇతర ప్రక్రియలకు అవసరమయ్యే 380 రకాల మొక్కలు ఉన్నాయి. వీటిలో చాలావరకు మొక్కల గురించి ప్రజలకు అవగాహన లేక ఎక్కడికక్కడే కొట్టేస్తున్నారు. అలా కొట్టకుండా అవగాహన కల్పిస్తుండడంతో పాటు ప్రత్యేకంగా బయో డైవర్సిటీ వాక్ వంటివి చేపడుతున్నారు.

సాగరంలో వ్యర్థాలు వేయవద్దంటూ..

నగర పరిధిలోని అనేక ప్రాంతాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో చేరుతున్నాయి. దీనివల్ల సంద్రంలోని అనేక జీవరాశులు ప్రాణాలను కోల్పోతున్నాయి. అదే సమయంలో కొన్నిసార్లు సముద్రం ముందుకు వచ్చి మళ్లీ అనూహ్యంగా వెనక్కి వెళుతుంటుంది. ఇలా కొన్ని మీటర్లు సముద్రం వెనక్కి వెళ్లినప్పుడు అనేక జీవరాశులు తీరానికి కొట్టుకొస్తుంటాయి. ఇందులో ఆక్టోపస్, బ్రిటల్ స్టార్స్, స్టార్ ఫిష్ వంటివి ఉంటాయి. ఇవన్నీ తీరానికి వచ్చినప్పుడు వ్యర్థాలుంటే వాటిలో చిక్కుకుని మృత్యువాత పడుతుంటాయి. అవి ప్రాణాలు కోల్పోకుండా ఉండాలంటే వ్యర్థాలు వేయకూడదని ప్రజలకు వివరిస్తున్నారు. ఇందుకోసం బీచ్‌లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కాగా పొట్లూరి అనిల్ చౌదరి ఏర్పాటు చేసిన ఈ సంస్థలో వలంటీర్లుగా నమిత, సత్యనారాయణ, వివేక్, దివ్యతోపాటు ఎంతోమంది పనిచేస్తున్నారు.

జీవరాశులను పరిరక్షించేందుకే..



ప్రజలకు తెలియకుండానే అనేక జీవరాశులకు నష్టాన్ని చేకూరుస్తున్నారు. అదే తెలిస్తే ఎవరూ అలా చేయరు. ఈ ఒక్క పాయింట్‌పైనే దృష్టి సారించి గ్రీన్స్ పావ్స్‌ను ఏర్పాటు చేశాం. పక్షులు, జంతువులు, సముద్ర జీవరాశులను పరిరక్షిం చేందుకు విభిన్న కార్యక్రమాలను ఆరేళ్లుగా నిర్వహిస్తున్నాం. ఎంతోమంది వలంటీర్లు తమతో భాగస్వాములవుతున్నారు. ప్రజలు కూడా తాము చెబుతున్న అంశాలను ఆసక్తిగా వింటూ ఆచరిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను అమలు చేసే దిశగా సంస్థను ముందుకు తీసుకువెళతాం.

- పొట్లూరి అనిల్ చౌదరి, గ్రీన్ పావ్స్ వ్యవస్థాపకుడు

రేగిన దుమ్ము, ధూళితో వాహనదారుల అవస్థలు



పోర్టు ఆస్పత్రి సమీపంలో దుమ్ము రేగుతున్న దృశ్యం



విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జాతీయ రహదారి మరమ్మతు పనులు గత కొద్ది రోజులుగా జోరుగా సాగుతున్నాయి. అత్యాధునిక పరికరాలను వినియోగించి రహదారిపై గల పై లేయర్‌ను తొలగించి మరమ్మతులు చేస్తున్నారు. ఈ పనులు జరుగుతున్న అనేకచోట్ల దుమ్ము, ధూళి పెద్దఎత్తున రేగుతుండడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. తాజాగా తాటిచెట్లపాలెం జంక్షన్ నుంచి పోర్టు ఆస్పత్రి వరకు ఉన్న జాతీయ రహదారిపై ఈ పనులు జరుగుతున్నాయి. దీంతో ఈ మార్గంలో పెద్దఎత్తున దుమ్ము, ధూళి రేగుతుండడంతో ద్విచక్ర వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము రేగకుండా నీటిని చిమ్మేలా చూడాల్సిన కాంట్రాక్టరు అలాంటి చర్యలు చేపట్టకపోవడంతోనే సమస్య ఉత్పన్నమవుతోంది.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- ఆశీల్‌మెట్ట అండర్ పాస్‌వే వద్ద డివైడర్ ఏర్పాటు



జీవీఎంసీ గాంధీ విగ్రహం అండర్ పాస్‌వే వద్ద సిమెంటు దిమ్మలతో ఏర్పాటు చేసిన డివైడర్

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆశీల్‌మెట్ట కూడలిలో అండర్ పాస్‌వే వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో వాటి నియంత్రణకు పోలీసులు చర్యలను ప్రారంభించారు. ఆశీల్‌మెట్ట జంక్షన్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వైపు అండర్ పాస్‌వేలో వెళ్లే వాహనాలు అండర్ పాస్‌వే నుంచి బయటకు వచ్చిన తరువాత కుడివైపునకు తిరిగి వీఎంఆర్డీఏ సెంట్రల్ పార్కు వైపు వెళ్లిపోతున్నారు. దీనివల్ల అదే సమయంలో గొల్లలపాలెం జంక్షన్ వైపు నుంచి అండర్ పాస్‌వే లోపలకు వెళ్లే వాహనాలు వేగంగా వస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ట్రాఫిక్ పోలీసులు అండర్ పాస్‌వే నుంచి బయటకు వచ్చే వాహనాలు కుడివైపు వెళ్లేందుకు వీల్లేకుండా గొల్లలపాలెం వైపు వెళ్లేలా సిమెంటు దిమ్మలతో డివైడరును ఏర్పాటు చేశారు. అండర్ పాస్‌వే నుంచి వచ్చేవారు వీఎంఆర్డీఏ సెంట్రల్ పార్కు వైపు వెళ్లాలనుకుంటే గొల్లలపాలెం జంక్షన్‌లో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద యూ టర్న్ తీసుకుని రావాల్సి ఉంటుంది. దీనివల్ల ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుందని పలువురు వాహనచోదకులు అభిప్రాయ పడుతున్నారు.

ఈ స్ట్రెచర్ రోగులకు కాదు.. మొక్కలకు!

- విక్టోరియా ఆస్పత్రిలో మొక్కల చేరవేతకు సిబ్బంది స్ట్రెచర్ వాడడంపై పలువురు పెదవివిరుపు



స్ట్రెచర్‌పై మొక్కలను తరలిస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులను తరలించేందుకు వినియోగించే స్ట్రెచర్‌ను ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో మొక్కల చేరవేతకు సిబ్బంది వినియోగించారు. మంగళవారం ఉదయం ఆస్పత్రిలో ఒకచోట ఏర్పాటుచేసిన మొక్కలను మరోచోటకు సిబ్బంది మార్చే పనులను చేపట్టారు. సాధారణంగా ఆయా మొక్కలను చేతితో కానీ ఇతర వాహనాల్లో గానీ తీసుకువెళ్లాలి. అయితే ఇక్కడి సిబ్బంది గర్భిణులు, బాలింతలను వార్డులు, డెలివరీ రూములకు తరలించేందుకు వాడే స్ట్రెచర్‌ను ఇందుకోసం వినియోగించడం శోచనీయం. వార్డులో ఉండే ఒక స్ట్రెచర్‌ను తెచ్చి, దానిపై మొక్కలు పెట్టి ఒకచోట నుంచి మరోచోటకు తరలించారు. దీనిని చూసిన పలువురు గర్భిణులు, బాలింతల సహాయకులు ఇదేం పని అంటూ పెదవివిరిచారు. ఉన్నతాధికారులు సిబ్బంది పనితీరును చూసినా కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ తరహా పనులకు ఇటువంటి పరికరాలను వినియోగించడం దారుణమంటూ పలువురు వ్యాఖ్యానించారు.

యారాడ తీరంలో బాలుడిని కాపాడిన లైఫ్ గార్డులు



బాలుడిని ఒడ్డుకు తెచ్చిన లైఫ్ గార్డులు

సింధియా, మే 20, (ఆంధ్రజ్యోతి): యారాడ సముద్రంలో సరదాగా స్నానానికి దిగి ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్న తెలంగాణ రాష్ట్రం రంగా రెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన అభిమన్యం (15) అనే బాలుడి ని లైఫ్ గార్డులు కాపాడారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కు చెందిన పలువురు పర్యాట కులు యారాడ సముద్ర తీరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అభిమన్యం సముద్రంలో స్నానానికి దిగాడు. అయితే కెరటాల అధికంగా ఉండడంతో ఒక్కసారిగా సంద్రంలోకి కొట్టుకు పోవడంతో పెద్దగా కేకలు వేశాడు. దీంతో సమీపంలో ఉన్న మెరైన్ పోలీసులు, లైఫ్ గార్డులు (గజ ఈతగాళ్లు) అప్రమత్తమయ్యారు. వెంటనే లైఫ్ గార్డులు సముద్రంలోకి వెళ్లి ఆ బాలుడిని సురక్షితంగా ఒడ్డుకు తేవడంతో ప్రాణాపాయం తప్పింది.

ప్రధాని కార్యక్రమానికి అధికారుల స్థల పరిశీలన



రుషికొండ బీచ్‌రోడ్డులో స్థలపరిశీలన చేస్తున్న ఆర్డీఓ సంగీత్ మాథుర్, ఇతర అధికారుల బృందం

సాగర్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ ఆర్కేబీచ్‌లో జరిగే కార్యక్రమానికి విచ్చేస్తున్నందున రుషికొండ బీచ్‌రోడ్డు వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారుల బృందం మంగళవారం ప్రాథమికంగా అనువైన స్థల పరిశీలన చేపట్టింది. ఆర్డీఓ సంగీత్ మాథుర్ ఆధ్వర్యంలో పలువురు అధికారులు రుషికొండ బీచ్‌రోడ్డులోని పలు స్థలాలను పరిశీలించారు. బీచ్‌రోడ్డులో ఉన్న ప్రేమసమాజం, రామానాయుడు స్టూడియో వరకు బీచ్‌రోడ్డు వెంబడి ఉన్న స్థలాలను యోగా కార్యక్రమానికి పరిశీలించారు. చినగదిలి రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, సీఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మేట్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్ ఆవశ్యకతపై మేయర్ సమీక్ష

- ప్రాజెక్టు వివరాలను వెల్లడించిన యూఎన్‌యూ, ఎన్ఐయూఏ, టీఈఆర్ఐ ప్రతినిధులు



సమీక్ష నిర్వహిస్తున్న మేయర్

వెంకోజీపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలో విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్ట నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ (యూఎన్‌యూ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ (ఎన్ఐయూఏ), ది ఎనర్జీ అండ్ రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్ (టీఈఆర్ఐ) ప్రతినిదులు నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు వివరించారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్లో యూఎన్‌యూ, ఎన్ఐయూఏ, టీఈఆర్ఐ ప్రతినిధులు.. మేయర్‌ను కలసి ట్రాన్స్ఫర్మేటివ్ క్లైమెట్ యాక్షన్ ప్లాన్ (టీసీఏపీ) ఆవశ్యకతపై విషయాలను వివరించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ట్రాన్స్ఫర్మేటివ్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్ వల్ల విశాఖ నగరానికి, ప్రజలకు కలిగే ప్రయోజనంపై బృందంసభ్యులతో చర్చించినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా అర్బన్ లివింగ్ ల్యాబ్ ప్లాట్ ఫార్మ్‌ను ఆవిష్కరించి తద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలు, అలాగే ఈ ప్రాజెక్టు ముఖ్యఉద్దేశం వాతావరణంలో వచ్చిన మార్పులవల్ల కలిగిన విపత్తులు,వడగాలులు, వరదలు తదితర విపత్తులు సంభవించినప్పుడు ప్రజల సహకారంతో నష్ట నివారణ ఎలా తగ్గించుకోవచ్చు అనే అంశంపై వివరంగా బృందం సభ్యులు వివరించారని తెలిపారు. దీనిపై పూర్తిగా చర్చించి ఏ విధంగా తదుపరి ప్రణాళికలు చేపట్టాలో మేయర్ వారికి సూచించారు.కార్యక్రమంలో క్లైమేట్ సెల్ ఎస్ఆర్‌యూ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపాలి



కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపాలని కోరుతూ ప్రదర్శనలో పాల్గొన్న అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల డిమాండ్

డాబాగార్డెన్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపాలని పలువురు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అఖిల పక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సీఐఎఫ్‌టీయూఐ అఖిల భారత అధ్యక్షుడు కనకారావులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపు ఆపాలని, శాశ్వత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులపై సస్పెన్షన్ వంటి చర్యలు, షోకాజ్ నోటీసులు రద్దు చేయాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని, హెచ్ఆర్ఏ ఇవ్వాలని కోరారు. దేశవ్యాప్తంగా లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని, స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. ఎన్నడూ లేని విధంగా ప్లాంట్ లోపల సైతం పోలీసులను పెట్టడమంటే కేంద్ర ప్రభుత్వ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడమేనని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తూ, కార్మికుల ఉపాధిని రక్షించుకునేలా దేశవ్యాప్తంగా కార్మికవర్గాన్ని ఐక్యంచేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.మణి, ఎం.సుబ్బారావు, వి.కృష్ణంరాజు, పైడిరాజు, రెహ్మాన్, లక్ష్మి, సత్యవతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

24న జిల్లా ఈత పోటీల జట్టు ఎంపిక

విశాఖపట్నం స్పోర్ట్సు, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్ ఈత (స్విమ్మింగ్) జట్టుకు ఈ నెల 24న బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సులోని స్విమ్మింగ్ పూల్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని సంఘం కార్యదర్శి మోహన్ వెంకటరామ్ తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో ఫ్రీస్టైల్‌కు సంబంధించి 50 మీ., 100 మీ., 200 మీ.. 400 మీ., 800 మీ., 1500 మీ. ఈవెంట్లలో బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై స్టైల్స్‌కు సంబంధించి 50 మీ., 100 మీ., 200 మీ. ఈవెంట్లలో, ఐఎం ఈవెంట్‌కు సంబంధించి 200 మీ., 400 మీ.లలో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైనవారు జూన్ 1 నుంచి పల్నాడు, నరసారావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి ఈత పోటీల టోర్నీలో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల ఈత క్రీడాకారులు ఈ నెల 23లోపు శిక్షకులు శ్రీధర్ (ఫోన్:80087 07798), రఘునాథరెడ్డి (ఫోన్:83090 95846)లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.